





మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో పృథ్విలింగాకారంలో స్వామివారు

శివశివ శంకర.. హరహర శంకర...

ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద ఉన్న శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివార్లను దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రికి కార్తీక దీపాలు వెలిగించి సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని ముక్కంటిని ప్రార్థించారు. : లోపలి పేజీల్లో..

కిలో పొగాకు రూ. 351

ఈ సీజన్‌లో ఇదే అధికం

- వారం నుంచి గరిష్ఠ ధరలో పెరుగుదల
- రెండు కేంద్రాల్లో ముగిసిన కొనుగోళ్లు



ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది మార్కెట్లో సోమవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.351 పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. గతంలో ఒకసారి కిలో రూ.346 వరకు వెళ్లి తిరిగి రూ.315కు దిగజారింది. అలా నడుస్తున్న మార్కెట్లో వారం రోజుల నుంచి క్రమంగా ధరల్లో పెరుగుదల కనిపించింది. నాలుగు రోజుల క్రితం కిలో రూ.335, రెండు రోజుల క్రితం రూ.346 పలికింది. సోమవారం టంగుటూరు వేలం కేంద్రంలో ఏకంగా రూ.351 ధర లభించింది. మిగతా వాటిలో గరిష్ఠ ధర కిలో రూ.350గా ఉంది. నాలుగు రోజుల క్రితం సగటున 35శాతం నుంచి 40శాతం వరకు నోబిడ్‌లు ఉండగా సోమవారం అవి 22.50శాతానికి తగ్గాయి. దక్షిణాదిలో 11 వేలం కేంద్రాలు ఉండగా నెల్లూరు జిల్లా పరిధిలోని కలిగిరి, డీసీపల్లి కేంద్రాలలో శనివారంతో కొనుగోళ్లు ముగిశాయి. మిగిలిన తొమ్మిది కేంద్రాల్లో సాగుతుండగా ఈ వారంలో ఒంగోలు-2, కనిగిరి, పొదిలి కేంద్రాల్లో కూడా వేలం ముగుస్తుందని సమాచారం.

7న డీఆర్సీ సమావేశం

మొంథా తుఫాన్ నష్టాలు, ఇతర అంశాలపై చర్చ

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో అత్యంత కీలకమైన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం ఈనెల 7వతేదీన నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రకాశం భవన్‌లోని సమావేశపు హాలులో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామానారాయణరెడ్డి అధ్యక్షతన జరగనుంది. తొలుత గతనెల 24న ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అప్పటికే వర్షాలు పడుతుండటం, భారీగా శుభకార్యాలు ఉండటంతో సమావేశానికి హాజరుకావాల్సిన కీలక ప్రజాప్రతినిధులు వచ్చే అవకాశాలు అంతగా లేకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి గత నెలాఖరులోనే నిర్వహించాలని భావించినా మొంథా తుఫాన్ వల్ల వీలు కాలేదు. దీంతో డీఆర్సీ సమావేశాన్ని ఈనెల 7న ఏర్పాటు చేశారు. తుఫాన్ ప్రబావంతో వాటిల్లిన నష్టాలతో పాటు, పలు ఇతర కీలక అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.

నేడు గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు
ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్
7

మొంథా తుఫాన్ జిల్లాలో వ్యవసాయ రంగంపై తీవ్రప్రభావాన్ని చూపింది. కీలక సమయంలో కురిసిన అతి భారీ వర్షాలు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను దెబ్బతీశాయి. రబీ పంటల సాగు కూడా ఆలస్యం కానుంది. పశ్చిమ ప్రాంతంలో పత్తి, మిర్చి, సజ్జ, కంది, వరి ఇలా పొలంలో ఉన్న ప్రతి పంటా దెబ్బతిని ఏదో ఒక స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇక ముమ్మరంగా రబీ పంటలు సాగు చేసే సమయంలో కుంభవృష్టి వానలు పడటంతో అత్యధిక ప్రాంతాలలో మరో పక్షం రోజులపాటు పొలాల్లోకి వెళ్లి సేద్యం చేసే అవకాశం లేదు. దీంతో సాగు ఆలస్యం కానుంది. అదును దాటిపోతుందేమోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.



తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఉప్పుగుండూరు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు (ఫైల్)

ఖరీఫ్ కష్టం రబీ జాప్యం

వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిన మొంథా తుఫాన్

- కీలక సమయంలో దెబ్బతీసిన భారీ వర్షాలు
- పశ్చిమాన పత్తి, సజ్జ, వరి, మిర్చిలకు నష్టం
- పంట పొలాల్లో పెరుగుతున్న కలుపు
- రబీ ప్రధాన పైర్ల సాగుకు అదును దాటే పరిస్థితి

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఎఫెక్ట్ వ్యవసాయంపై తీవ్రంగా ఉంది. ఖరీఫ్ పంటలు భారీగా దెబ్బతినగా, రబీ సాగు ఆలస్యం కానుంది. జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ సీజన్‌గా... అక్టోబరు నుంచి రబీ సీజన్‌గా పరిణిస్తారు. జిల్లాలో అక్టోబరు తొలిపక్షంలో వేసే పంటలను కూడా ఖరీఫ్ సీజన్‌గానే లెక్కిస్తున్నారు ఖరీఫ్‌లో జిల్లాలో వ్యవసాయశాఖ పరిధిలో లక్షా 29వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేస్తారు. అలాగే ఉద్యాన శాఖ పరిధిలో మరో 20వేల హెక్టార్లలో మిర్చి, కూరగాయలు, ఇతరత్రా సాగవుతాయి. ఈ ఏడాది దాదాపు లక్షా 24వేల హెక్టార్లలో వ్యవసాయశాఖ పరిధిలో, 15వేల హెక్టార్లలో ఉద్యానశాఖ పరిధిలో పంటలు వేశారు. ప్రధానంగా కంది, పత్తి, వరి, సజ్జ, మొక్కజొన్న, బర్లీ పొగాకు, మిర్చి తదితరాలు సాగు చేశారు. ఆ పంటల్లో అధిక శాతం పూత, పిందె, కోత దశలకు చేరాయి. కొంత విస్తీర్ణంలో ఎదుగుదల దశలో ఉన్నాయి. అక్టోబరు నెల ఖరీఫ్ పంటలకు కీలక సమయం. మరోవైపు రబీ పైర్లలో అత్యధిక భాగం అక్టోబరు, నవంబరుల్లోనే

మిగతా 6వ పేజీలో

పొగ నారుకు ఇక్కట్లే!

పశ్చిమ ప్రాంతంలో కనీసం పక్షం రోజులు, ఇతర ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు వారాలపాటు భూములు ఆరే అవకాశం కనిపించడం లేదు. దీని వల్ల రబీలో కీలక పంటలైన శనగ, పొగాకు, మిర్చి, మినుము సాగు ఆలస్యం కానుంది. ఒక్క వరి మినహా ఇతర ఏ పంటలను ప్రస్తుతం సాగు చేసే వీలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకు నారు మడులు కూడా వర్షాలకు తుడిచి పెట్టుకుపోయాయి. కాస్తంత పొలం ఆరిన చోట పొగాకు సాగుకు మొక్కల కోసం రైతులు అవస్థ పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.



ఒంగోలు మండలం ఉలిచి వద్ద దెబ్బతిన్న పొగనారు మడి



మార్కాపురం మండలం బొందలపాడు వద్ద ఆరు రోజులుగా వరద నీటిలో ఉన్న మిర్చి పొలం

పోటెత్తిన అర్జీదారులు

- రెండు వారాల అనంతరం 'మీ కోసం'
- సమస్యలను ఏకరువుపెట్టిన ప్రజలు
- వ్యక్తిగత, భూ, ఇతర సమస్యలపై వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు అర్జీదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ సమస్యలను అధికారుల వద్ద ఏకరువు పెట్టారు. రెండు వారాల అనంతరం మీకోసం కార్యక్రమం కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఉదయం 10 గంటలకే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను చేతితో పట్టుకొని క్యూలైన్లో నిల్చున్నారు. రెండు వారాల క్రితం దీపావళి పండుగ కావడంతో ప్రభుత్వ సెలవు కాగా, గత వారం మొంథా తుఫాన్ ప్రభావంతో మీకోసం కార్యక్రమాన్ని రద్దు

మిగతా 6వ పేజీలో

స్పెషల్ బ్రాంచి సీఐ రాఘవేంద్ర వీఆర్‌కు..

- ఆయనపై పలువురు ఎమ్మెల్యేల ఆరోపణలు
- ఇటీవల హోంమంత్రికి కూడా ఫిర్యాదు

ఒంగోలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాఘవేంద్రరావును రేంజ్ వీఆర్‌కు పిలుస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాఘవేంద్రరావు ఇప్పటికే మూడు పర్యాయాలు ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. మూడో దఫా సాధారణ ఎన్నికల ముందు నుంచి ఎస్‌బీలో కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారిన తరువాత ఆయనపై పలువురు ఎమ్మెల్యేలు నేరుగా ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో ఆరోపణలు చేశారు. హోంమంత్రికి కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రాఘవేంద్రను వీఆర్‌కు పిలిచారు. ఆయన స్థానంలో ఇక్కడ ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న భీమానాయక్‌కు కానీ, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌కు కానీ తాత్కాలిక బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంది.



బండ్లమూడిలో దాడి చేస్తున్న వారిని వారిస్తున్న కానిస్టేబుల్



గాయపడిన రామయ్య, ఏసుదాసు, ఏసేపు

బండ్లమూడిలో రణరంగం

దళితులపై మరో వర్గం దాడి

- ఎస్సీలకు చెందిన పొలంలో మేసిన గొర్రెలు
- యజమాని ఇంటికి వెళ్లి బాధితుల నిలదీత
- వాగ్వాదం జరగటంతో స్టేషన్‌కెళ్లి ఫిర్యాదు
- హెడ్ కానిస్టేబుల్ వచ్చి గ్రామంలో విచారణ చేస్తుండగా అక్కడకు చేరుకున్న ఎస్సీ వర్గీయులు
- ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి కర్రలతో దాడి
- నలుగురు ఎస్సీలకు గాయాలు, రిమ్స్‌కు తరలింపు
- మరోవర్గానికి చెందిన ఇరువురికి గాయాలు

చీమకుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన వివాదం చినికిచినికి గాలివానలా మారి దాడులకు దారితీసింది. కానిస్టేబుల్ వారిస్తున్నా సరే ఎస్సీలపై మరో వర్గం కర్రలతో దాడి చేసింది. ఈ ఘటన సోమవారం మండలంలోని బండ్లమూడి గ్రామ నడిబొడ్డున చోటుచేసుకుంది. సీఐ దాసరి ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్.సుబ్బారెడ్డికి చెందిన గొర్రెలు ఇదే గ్రామ ఎస్సీకాలనీకి చెందిన కంట్లం ఏసుదాసు, ఎలీసమ్మ, రామయ్యలకు చెందిన సరుగుడు పొలంలో పడటంతో పంట నష్టం జరిగింది. ఈ విషయమై నిలదీయడానికి పొలం

మిగతా 6వ పేజీలో

ఖరీఫ్ కష్టం.. రబీ జాప్యం

(5వ పేజీ తరువాయి)

వేస్తారు. పశ్చిమ ప్రాంతంలో పొగాకు, శనగ అధికభాగం అక్టోబరులోనే సాగు చేస్తారు. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో నవంబరు, డిసెంబరులలో వాటి సాగు చేపడతారు. అక్టోబరు, నవంబరుల్లో అన్ని ప్రాంతాల్లోనూ వరినాట్లు వేస్తారు. అలా అక్టోబరు రబీ పంటల సాగుకు కీలకం. ఇలాంటి సమయంలో ఒక్కసారిగా తుఫాన్ విరుచుకుపడి జిల్లాను ముంచెత్తింది. కేవలం 36 గంటల వ్యవధిలో సగటున జిల్లాలో 18.40 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

నష్ట అంచనాల్లో అధికారులు

జిల్లాలో అక్టోబరులో సాధారణ వర్షపాతం 20.57 సెం.మీ కాగా ఏకంగా 49.96 సెం.మీ కురిసింది. పొన్నలూరు మండలంలో 25.02 సెం.మీ సాధారణ వర్షపాతం అయితే అక్కడ దాదాపు 70 సెం.మీ నమోదైంది. సంతనూతలపాడు, పీసీపల్లి పామూరు, ఒంగోలు, మర్రిపూడి, కొత్తపట్నం, కొండపి, కనిగిరి, చీమకుర్తి, సీఎస్‌పురం, మద్దిపాడు, ఎన్‌జీపాడు, పొదిలి, సింగరాయకొండ, టంగుటూరు తదితర మండలాల్లో 40 నుంచి 65 సెం.మీ వరకు కురిసింది. మిగతా మండలాల్లోనూ 30 నుంచి 40సెం.మీ పడింది. ఇలా సాధారణం కన్నా పలుచోట్ల అధికంగా ఈ నెలలో కురవడం, అందులోనూ తుఫాన్ సమయంలో భారీ వర్షాలు ముంచెత్తడంతో పొలంలో ఉన్న ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతిన్నాయి. దాదాపు 40వేల హెక్టార్లలో పత్తి, మిర్చి, సజ్జ, కంది, వరి, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. ఇంచుమించు 15వేల హెక్టార్లలో ఆ పంటలకు పూర్తిగా నష్టం జరిగినట్లు అధికార వర్గాలు అంచనా వేసి రైతువారీ నష్టాలపై ఎన్యుమరేషన్ చేస్తున్నారు.

బురదమయంగా భూములు

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలు చేతికొచ్చే అవకాశం లేదు. నీటిలో రెండు మూడు రోజులు ఉన్న ఇతర విస్తీర్ణంలోని పంటలు కోలుకుంటున్నప్పటికీ ఆ పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గి రైతులు భారీగా నష్టపోనున్నారు. మరోవైపు తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల ప్రభావం రబీ సాగుపైనా తీవ్రంగా చూపనుంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో శనగ, పొగాకు, మిర్చి వంటి పంటలను అక్టోబరులో ముమ్మరంగా వేస్తారు. అలాగే తూర్పు ప్రాంతంలో కాస్తంత ఆలస్యంగా వేసే ఆ పంటలకు భూములు సిద్ధం చేసే పని ఆ సమయంలో జోరుగా సాగుతుంది. అయితే అక్టోబరు 20 నుంచి వర్షాలు ప్రారంభమై తుఫాన్ సమయంలో ముంచెత్తడంతో పొలాల్లో భారీగా వర్షపు నీరు పారి బురదమయంగా మారాయి. అవి పూర్తిగా ఆరి సేద్యం చేస్తే తప్ప పంటలు వేసే అవకాశం లేదు.

బండ్లమూడిలో రణరంగం

(5వ పేజీ తరువాయి)

యజమానులైన ఎస్సీలు సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ వాగ్వాదం చోటుచేసుకోవడంతో నష్టపరిహారం చెల్లిస్తామని సుబ్బారెడ్డి ఒప్పుకున్నాడు. దానికి అంగీకరించని పొలం యజమానులు చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గ్రామానికి వచ్చి బస్టాండ్ సెంటర్‌లో విచారణ ప్రారంభించారు. అదేసమయంలో పొలం యజమానులు, మరికొంతమంది తమ బంధువులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీలు సామాజికవర్గం మొత్తాన్ని కలిపి మాట్లాడుతున్నారంటూ కొందరు అడ్డుకున్నారు. 'మా ఇళ్ల మీదకే వచ్చి దౌర్జన్యం చేస్తారా..' అంటూ అక్కడే ఉన్న కొంతమంది కర్రలతో ఎస్సీలపై ఒక్కసారిగా దాడికి దిగారు. మధ్యలో హెడ్ కానిస్టేబుల్ సర్దిచెబుతున్నా వినిపించుకోలేదు. దీంతో బండ్లమూడి బస్టాండ్ సెంటర్ రణరంగంగా మారింది. ఈ ఘటనలో ఎస్సీలు కంట్లం రామయ్య, ఏసుదాసు, ఏసేపు, మరో మహిళకు గాయాలయ్యాయి. వారిని బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇదే ఘటనలో గోపిరెడ్డి బాలఓబుల్‌రెడ్డి, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరూ వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై కంట్ల ఏసుదాసు ఫిర్యాదు మేరకు వనిపెంట శ్రీనివాసరెడ్డి, బాలఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఓబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురు ఎస్సీలపై కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి విచారిస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనటంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.





భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవార పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచే స్థానిక శివాలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి కార్తీకదీపాలను వెలిగించి, పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం అక్కడి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, సంతపేట సాయిబాబా మందిరంలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన మొదలైన కార్యక్రమాలు జరిగాయి. సోమవారం సాయంత్రం సైతం మహిళలు కార్తీక దీపారాధనలలో పాల్గొన్నారు.

బెల్టు షాపుల నిర్మూలనకు కఠిన చర్యలు

మార్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపుల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ కె.విజయ అన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సోమవారం ఏసీ విజయ సందర్శించి సమీక్ష నిర్వహించారు. మార్కాపురం సర్కిల్ పరిధిలో నమోదైన కేసులపై సమీక్షించారు. పట్టణ, మండల పరిధిలోని వైన్, బార్ షాపులలో తప్పనిసరిగా ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసిన తర్వాతే విక్రయాలు జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు మద్యం దుకాణాలకు దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ అధికారి ఎస్.అయేషాబేగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పొదిలి రూరల్ మండలంలో 71 నంబరు, దర్శి రూరల్ మండలంలోని 89 నంబరు, కనిగిరి రూరల్ మండలంలోని 125 నంబరు, బేస్తవారపేట మండలలోని 158 నంబరు దుకాణాలకు దరఖాస్తులు ఈనెల 10 లోపు చేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చుని తెలిపారు. జిల్లాలోని అన్ని ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లలో దరఖాస్తులు స్వీకరిస్తారని అన్నారు. ఈనెల 12న ప్రకాశం భవన్‌లో ఉదయం 8 గంటలకు పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి దుకాణాలు ఎంపిక జరుగుతుందని ఎక్సైజ్ అధికారి తెలిపారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలో నీట మునిగిన వరి, వేరుశనగ పంట పొలాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భారీ తుఫాన్ కారణంగా రైతన్నల పరిస్థితి దయనీయంగా ఉందని, రైతుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

7నుంచి చెస్, 23 నుంచి యోగా పోటీలు

పంగులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు చెస్, 23 నుండి 25 వరకు యోగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్. జిల్లా కార్యదర్శి కె.ప్రతిమ తెలిపారు. ఎస్‌జీఎఫ్ 69వ జిల్లాస్థాయి చెస్, యోగా పోటీలు ఒంగోలులో ముగిశాయన్నారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలు మన్యం జిల్లా జోగంపేటలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలు 23 నుంచి 25 వరకు బాపట్ల జిల్లా, జే.పంగులూరు మండలం చందలూరులో జరుగుతాయని కార్యదర్శి ప్రతిమ తెలిపారు.

చెంచు గిరిజనులను ఆదుకోండి

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన చెంచు గిరిజనులను ఆదుకోవాలని రాష్ట్ర చెంచు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ నాయకుడు అంకారావు కోరారు. ఈ మేరకు శ్రీశైలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రాజెక్ట్ అధికారి వెంకటశివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మొంథా తుఫాన్‌తో గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాలోని పలు గిరిజన గూడేలలో ఇళ్లు దెబ్బతిన్నాయని, కొందరికి పంట నష్టం జరిగిందని వాటిపై విచారణ జరిపించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. పరిశీలన పూర్తి కాగానే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని పీవో చెప్పారు.

పోటెత్తిన అర్జీదారులు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఈ నేపథ్యంలో అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలకు చెప్పుకునేందుకు తరలివచ్చారు. ప్రధానంగా వ్యక్తిగత సమస్యలతోపాటు భూములు, సర్వేలో లోపాలు, గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల సమస్యలపై వినతులు అధికంగా వచ్చాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారు సంతృప్తి చెందేలా సేవలు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారథిజాన్సన్, విజయజ్యోతి, మాధురితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తమ భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకొని చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కనిగిరి మండలం చల్లగిరిగల గ్రామానికి చెందిన మక్కెన సుజాత కలెక్టర్ రాజాబాబును కోరారు. తమకు పెద్దల ద్వారా సంక్రమించిన 14.86 ఎకరాల్లో కొంత భూమిని కొందరు కొందరు కలుపుకొని ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. తమ భూమి తమకు అప్పగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు సాగు చేసి తీవ్రంగా దెబ్బతిన్న కౌలు రైతుల పేర్లు నమోదు చేసి నష్టపరిహారం వారికే ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో పాక్షికంగా 40వేల ఎకరాలు, పూర్తిగా 25వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు పత్తి, సజ్జ, మిర్చి పంటలు దెబ్బతినడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో కూడా ఇలాంటి విపత్తులు జరిగినప్పుడు నష్టపరిహారం కౌలురైతులకు కాకుండా భూయజమానులకు అందిందని, అలా జరగకుండా సాగుచేసిన కౌలురైతులకే పరిహారం అందే విధంగా చూడాలని కోరారు. కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి వీ.బాలకోటయ్య, రైతులు పాల్గొన్నారు.

ఒంగోలులో ఇంటి స్థలాలు ఇస్తామని దొంగపట్టాలు సృష్టించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ కోరారు. ఇల్లు లేకుండా ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి మీకు ఇల్లు ఇస్తామని వారి వద్ద కొంతమంది వ్యక్తులు డబ్బులు తీసుకొని ఆరు నెలల నుంచి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొత్తకోట వెంకటేశ్వర్లుతోపాటు బాధితులు ఉన్నారు.

ఒంగోలు నగరంలో రేబిస్ వ్యాధికి ప్రజలు గురికాకుండా కుక్కలను నియంత్రణ చేయాలని వివిధ వర్గాల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో చర్చ జరుగుతుందన్న విషయాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒంగోలు నగరంలో ఇటీవల కాలంలో కుక్కల వలన జరిగిన కొన్ని ఘటలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

చిత్రజ్యోతి
SINCE 1965


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

దీక్షిత్ శెట్టి



విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



నిండు కుండలా నీరున్న చిన్నకండలేరు

చిన్నబోతున్న చెరువులు

- ఒకవైపు ఆక్రమణలు.. మరోవైపు పాలకుల నిర్లక్ష్యం
- వర్షపునీటిని ఒడిసి పట్టలేకపోతున్న వైనం
- కొన్ని చెరువులకు నీరే రాని దైన్యం
- ఐదేళ్లలో చెరువులను పట్టించుకున్న నాధులే లేరు



నాయుడుపాలెం చెరువులో బోరువేసి సాగు

ఒకప్పుడు గ్రామాల్లో సాగుకు ఉపయోగపడ్డ చెరువులను ఇప్పుడు పట్టించుకునే నాధుడు లేక చిన్నబోతున్నాయి. ఒక చెరువు నిండి అలుగుపారి నీరు వెళితే అది మరో చెరువుకు చేరేలా గతంలో పూర్వీకులు తవ్విన గొలుసుకట్టు చెరువులు ఇప్పుడు నిండినా అవి నిలబడలేని స్థితిలో కొన్ని ఉంటే, మరికొన్ని చెరువులకు నీరే చేరకుండా పైభాగంలో ఎక్కడికక్కడ అడుక్డుకట్టలు వేసిన కారణంగా ప్రధాన చెరువులు వెలవెలబోతున్నాయి. కొందరు ఆక్రమించి సాగుకు ఉపయోగించుకుంటున్న కారణంగా కొన్ని చెరువులు చిన్నబోతుంటే గత ఐదేళ్ళ ప్రభుత్వం పూర్తిగా చెరువులను విస్మరించటంతో ప్రస్తుతం చెరువులన్నీ చిన్నబోతున్నాయి.

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎక్కువ భాగం ఆక్రమణలతోనే చెరువులు కుంచించుకుపోయాయి. ముఖ్యంగా ఎర్రగొండపాలెం మండలం మురారిపల్లి చెరువు గతంలో సాగుకు ఉపయోగపడింది. వర్షాలు సకాలంలో కురిసి నీరు చేరిన పలు సందర్భాల్లో ఈ చెరువు కట్ట కూడా తెగిపోయిన సంఘటనలు ఉన్నాయి. అటువంటి చెరువుకు ప్రస్తుతం కురిసిన తుఫాను సమయంలో కూడా నీరు రాకుంది. ఇప్పుడే కాదు ఇక ఎప్పటికీ ఈ చెరువుకు నీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఆక్రమణలు. చెరువు విస్తీర్ణంలో దాదాపు 40శాతం ఆక్రమణలకు గురికాగా ఇక చెరువుకు నీరు రావాలంటే పై భాగంలో అడ్డు లేకుండా ఉండాలి. కానీ ఆ పరిస్థితి లేకపోవటంతో చెరువుకు నీరే రాకుండా పోతోంది.

చిన్నబోతున్న చిన్నకండలేరు

ప్రధాన చెరువుల్లో పుల్లలచెరువులోని చిన్నకండలేరు ఒకటి. ఇది పూర్వం నల్లమల అటవీ ప్రాంతంలో రెండు కొండలు మధ్య కంభం చెరువు తరహాలో నిర్మించారు. దీనికింద దాదాపు 1100 ఎకరాల ఆయకట్టు కూడా ఉంది. ఈ చెరువు ఒకసారి పూర్తిగా నిండితే దాదాపు మూడేళ్ల పలు గ్రామాల భూములకు భూగర్భజలాలు పెరుగుతాయి. అటువంటి చెరువు కట్ట బలహీనమై నీరు లీకై పోతున్నా పట్టించుకున్న వారు లేరు. కట్ట తెగితే దాదాపు నాలుగైదు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిసినా నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోతున్నారు. ఈ చెరువుకు ప్రస్తుతం దాదాపు 30 అడుగుల మేర నీరు వచ్చి చేరింది. దీనిని నిలుపుకుంటే కనీసం రెండేళ్లపాటు రైతులకు ఢోకా లేదు. అటువంటి చెరువు కట్ట మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ నీరు తీగలేరు కాలువ ద్వారా ఈ చెరువు వరకు తీసుకువచ్చి దీనిని నింపాలనే ప్రతిపాదన కూడా ఉంది. అటువంటి చెరువు ఆలనాపాలనా లేకుండా ఉంది.

ఇటుక వ్యాపారుల చేతుల్లో త్రిపురాంతకం చెరువు

ఇక ప్రధానమైన చెరువుల్లో త్రిపురాంతకం కూడా ఉంది. అమ్మవారి ఆలయానికి సమీపంలో ఉన్న ఈ చెరువు నిండటమే గగనమైంది. దీని చుట్టూ వ్యాపారులు ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవటం, బట్టీ నిర్వాహకులంతా మట్టిని తవ్వి తీసుకెళ్లటం ద్వారా చెరువు రూపే మారిపోయింది. ఈ చెరువుకు ఉద్దేశపూర్వకంగా కొందరు నీరు రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్టలు వేస్తున్నారని, కొన్ని సప్లై చానళ్ల మరమ్మతులు కాకుండా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటీవల తుఫానుకు ఈ చెరువుకు కూడా నీరు వచ్చినా అది కేవలం ఇంకిపోవటానికి తప్ప ఎందుకూ ఉపయోగంలేని విధంగా చెరువు రూపు తయారయ్యింది. ఈ చెరువుకు సాగరు నీరు నింపాలనే ప్రతిపాదన కూడా చాలా కాలంగా ఉన్నా పాలకులు దీనిని పట్టించుకోకపోవటం శోచనీయం.

పలు చెరువుల దుస్థితి ఇది

నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో కూడా చెరువుల పరిస్థితి ఇలానే ఉంది. ఆక్రమణలతో కొన్ని నిరుపయోగంగా మారితే, మరమ్మతులు లేకపోవటంతో మరికొన్ని కునారిల్లుతున్నాయి. అధికారులు గతంలో గుర్తించిన ప్రకారమే దాదాపు అన్ని చెరువుల్లో 450 ఎకరాల మేర ఆక్రమణకు గురై సాగు భూమిగా మారినట్టు తెలుస్తోంది. ఎర్రగొండపాలెం మండలంలోని మిల్లంపల్లి, కొలుకుల, గుంరిజేపల్లి తదితర గ్రామాల్లో చెరువులు కుచించుకుపోతుండగా అందులో కొలుకుల చెరువులోనే దాదాపు 60ఎకరాలు, అమానిగుడిపాడులో 50 ఎకరాలకుపైగా ఆక్రమణ జరిగినట్టు తెలిసింది. పుల్లలచెరువు మండలంలోని రాచకొండ చెరువు, ఎండ్రపల్లి చీమలదిన్నె చెరువు, గంగవరం చీకటిచెరువు, నాయుడుపాలెం చెరువు ఆక్రమణలే కాకుండా చెరువుల్లోనే పదుల సంఖ్యలో బోర్లు వేసుకుని సాగు చేసుకుంటున్నారు. వీటికి వ్యవసాయ భూముల్లో ఉన్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్‌లు కూడా ఇవ్వటం విశేషం. మొత్తంమీద సాగునీటి చెరువులను మరమ్మతులు చేయటంతోపాటు ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించి చెరువులను రక్షించగలిగితే సాగునీరుకు కాకున్నా భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు వచ్చినప్పుడు భూగర్భజలాలు తగ్గకుండా ఉండేందుకు దోహదపడతాయి. ఆ దిశగా పాలకులు అధికారులు ఆలోచించి చెరువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

బాధితులకు భరోసా ఇస్తూ...

- సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు
- ఎస్పీ గ్రీవెన్స్‌లో 117 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి బాధితులకు భరోసా కల్పిస్తున్నారు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 117 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. దీంతో ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలు సత్వరమే పరిష్కరం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులపై వచ్చిన ఫిర్యాదుకు స్పందించిన ఎస్పీ

పోలీసులపై వచ్చిన ఫిర్యాదుకు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు అత్యంత వేగంగా స్పందించి కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పిలవాలని ఆదేశించారు. అదే క్రమంలో అక్కడ పనిచేస్తున్న ఎస్సైని హెచ్చరిస్తానని బాధితులకు భరోసా కల్పించారు. చంద్రశేఖరపురంలో పనిచేస్తున్న ఎస్సై తన రూటే సపరేటు అంటూ వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు చేయడానికి వెళ్లిన సీపీఎం నాయకుడిపై దౌర్జన్యం చేశాడని, అందుకు సంబంధించి గతనెలలో పనిచేసిన పామూరు సీఐకి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. అక్కడ పనిచేస్తున్న కానిస్టేబుల్ చంద్రనాయక్ డబ్బులు వసూలు చేస్తూ ఉంటాడని, గణేష్ ఉత్సవాల సమయంలో పర్మిషన్ కోసం వెళితే రూ20 వేలు డిమాండ్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించినందుకు ఎస్సైకు చెప్పి తనపై దౌర్జన్యం చేయించాడని సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే కానిస్టేబుల్ చంద్రనాయక్‌ను వీఆర్‌కు పిలవాలని ఎస్పీ ఆదేశించారు.

వైసీపీ నేత కొమ్ముూరిపై వీరయ్య భార్య ఫిర్యాదు

తన కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు అసత్య ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకుడు కొమ్మూరి కనకరావుపై తగు చర్యలు తీసుకోవాలని ముప్పవరపు వీరయ్య చౌదరి భార్య సుచిత్ర ఎస్పీకి ఫిర్యాదు చేశారు . గత 15రోజుల క్రితం ఓ టీవీ చానల్ డిబేట్‌లో పాల్గొని తన భర్త నకిలీ మద్యం తయారు చేస్తుంటారని, వాటాల మధ్య విభేధాలు కారణంగా హత్య చేశారని అవాస్తవాలు మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని వద్ద తన భర్త హత్యకు సంబంధించి సాక్షాలు ఏమైనా ఉంటే పరిశీలించి, లేకుంటే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులను సీనియారిటీ జాబితా ప్రకారం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం ఉదయం నుంచి కలెక్టరేట్‌లోని పంచాయతీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లాపంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగోన్నతుల కోసం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతకంలో ఆప్షన్ ఫారాన్ని సమర్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

దత్తత అనేది దేవుడు ఇచ్చిన వరం

- కలెక్టర్ రాజాబాబు



దత్తత సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు లేని దంపతులకు దత్తత అనేది దేవుడు ఇచ్చిన వరం లాంటిదని కలెక్టర్ పీ రాజాబాబు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నవంబరు నెలలో నిర్వహించనున్న దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల పోస్టర్లను సోమవారం కలెక్టర్ రాజాబాబు కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలన్నారు. రాష్ట్రాలలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని పిల్లల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. చట్టపరంగా పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఉన్నారు.

వరద పాపం గత ప్రభుత్వానిదే

- కాలువల నిర్వహణను పట్టించుకోలేదు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



స్వర్ణ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే వరద విపత్తులకు కామణమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. సోమవారం వరద ప్రభావిత, చినగంజాం, కారంచేడు, ఇంకొల్లు, పర్చూరు మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. పంట నష్టాల వివరాలు, కాలవల పరిస్థితులను సమీక్షించారు. వైసీపీ హయాంలో కాలవ కట్టలను కూడా బలోపేతం చేయలేదన్నారు. ప్రస్తుతం రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఎలాంటి ఆదోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. బకింగ్‌హామ్ కెనాల్, వరద కాలువను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. వరద కాలువలను ఎలాంటి మరమ్మతులు చేయకుండా వదిలి వేయడంతో వరద నీరు పంటపొలాలను ముంచెత్తిందన్నారు. ఇలాంటి దుస్థితి పునరావృతం కాకుండా కెనాల్‌కు పడిన గండ్లను పూడ్చివేసి ఆధునీకరణకు కృషిచేస్తామన్నారు. వరద కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి పరిహారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. వాడరేవు - పిడుగురాళ్ల హైవేలో తిమ్మరాజుపాలెం సమీపంలోని తుండి వాగును ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. కాలువ ఆధునీకరణ, మరమ్మతులు లేక పూడికతో నిండిపోయి వరద నీరు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే వాగు ఆక్రమణలు తొలగించి ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు.

డ్రోన్‌తో కలుపు మందు పిచికారీ

కారంచేడు మండలం స్వర్ణ - రంగప్ప నాయుడువారిపాలెం పొలాల సరిహద్దులో యువరైతు నాగరాజు డ్రోన్ ద్వారా కలుపు మందు స్ప్రే విధానాన్ని ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు.

సంకల్పాన్ని నెరవేర్చుకుంటున్నాను : ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : పురాతన రామాలయాన్ని పునఃనిర్మించాలని ఎన్నికల సమయంలో సంకల్పించానని, ఆ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. స్థానిక సీతారామస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి హాజరై శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హోమం పూజలలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేని ఆలయ కమిటీసభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, కమిటీ అధ్యక్షులు వి.వెంకటరామానుజం, దేవదాయశాఖ డీ.ఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడుసుతొక్కనేల... కాలుజారనేల!

- జగనన్న కాలనీ రహదారి అస్తవ్యస్తం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

మర్రిపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మర్రిపూడి పొట్టిరెడ్డి పాలెం వద్ద నిర్మించిన జగనన్నకాలనీ సమస్యలతో కునారిల్లుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 50కిపైగా పక్కాగృహాలకు వసతులు లేకపోవడంతో గృహయజమానులు నివాసముండేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో అంతర్గత రహదారులు చిల్లచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఇటీవల ఎలాంటి నివాస గృహాలు లేని 4 మంది లబ్ధిదారులు విధిలేని పరిస్థితుల్లో గృహప్రవేశాలు చేశారు. తీరా ఇళ్లలోకి చేరిన తరువాత వారి ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. కాలనీ వాసుల అవసరాలు తీర్చేందుకు వేసిన తాగునీటి బోరు మోటారు మరామ్మతులకు గురవడంతో నీటి సరఫరా లేకుండా పోయింది. వాడుక నీటి కోసం సమీప వ్యవసాయ పొలాల్లో బోరుబావుల వద్ద నుంచి తెచ్చుకోవలసి వస్తోందని వాపోతున్నారు. దీనికి తోడు అంతర్గత రహదార్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని వచ్చే వాడుక నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. మురుగు నీరు నిల్వ చేరడంతో దోమల ధాటికి తట్టుకోలేక పోతున్నామని వాపోతున్నారు. దీనికితోడు కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి పటిష్ట పరచకపోవడంతో సమీప పొలాల నుంచి వచ్చే వృధా నీరు రోడ్డుపై నిలిచి మోకాలి లోతున గుంతలు ఏర్పడ్డాయి. కాలనీలోకి వెళ్లాలంటే బురదమార్గం గుండానే వెళ్లకతప్పడం లేదు. ఇటీవల కూరాకు బాలరంగయ్య ద్విచక్ర వాహనంపై వెళుతూ జారిపడటంతో చేతికి గాయమైంది. సుబ్బారావు అనే యువకుడు సైతం ఆ రహదారిగుండా ప్రయాణిస్తు జారిపడి క్షతగాత్రుడయ్యాడు. ముఖ్యంగా రాత్రిపూట కాలనీలోకి వెళ్లాలంటే ఎక్కడ జారిపడిపోతామోనని బయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం బురదగుండా ప్రయాణించాల్సి వస్తుండటంతో చర్మ సంబంధమైన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిని మట్టితో మెరక తోలి రాకపోకలకు వీలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. మరమ్మతులకు గురైన బోరుమోటారును రిపేరి చేయించి వాడుక నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు. పూర్తిస్థాయిలో లబ్ధిదారులు చేరక పోవడంతో విధిలేని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ప్రధాన రహదారులను సీసీరోడ్లుగా మార్చి సైడు కాలువలు ఏర్పాటు చేస్తే గృహ లబ్ధిదారులు గృహాలలో చేరే అవకాశం ఎంతైనా ఉంది.



బురదమయమైన జగనన్న కాలనీకి వెళ్లే రహదారి

రూ.22 కోట్లతో పొదిలి పట్టణాభివృద్ధి

- సిద్ధమైన ప్రణాళికలు
- ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పొదిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పట్టణ అభివృద్ధికి రూ.22 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక టింబర్ డిపోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు మంజూరైన వెంటనే సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను తీరుస్తామని ఎమ్మెల్యే వివరించారు. అభివృద్ధి పనులను చకచకా సాగేందుకు ప్రజలు, వ్యాపారులు నగర పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని, దానిని అధిగమించేందుకు కృషి చేస్తామని చెప్పారు. వైసీపీ హయాంలో దర్శి ఎన్నెస్పీ కెనాల్ నుంచి 28 గంటలు మాత్రమే పంపింగ్ చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం 48 గంటలు పంపింగ్ జరుగుతోందన్నారు. అయినా కొంతవరకు నీటి సమస్య ఉందని, ఈనెల 7వ తేదీన జరిగే డీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఇమాం సాహెబ్, టీడీపీ పట్టణాధ్యక్షుడు ముల్లా కుద్దూష్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవులూరి యలమంద, నాయకులు సామంతపూడి నాగేశ్వరావు, ఎర్రవం రెడ్డి వెంకటేశ్వరెడ్డి, ఏఎంసీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

అంగన్వాడీ గూడు గోడు తీరేదెప్పుడో!

- 14 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్న దుస్థితి

మర్రిపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాతాశిశుసంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలు నేటికీ పలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాల భవననిర్మాణ పనుల ఊసే పట్టించుకోలేదు. దీంతో చాలీచాలని అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అప్పట్లో నెలవారీ అద్దెలు చెల్లించకపోవడంతో కార్యకర్తలు ప్రతినెలా ముందు తమచేతి డబ్బులు పెట్టి అద్దెలు చెల్లించేవారు. మండలంలోని మర్రిపూడి, కూచిపూడి సెక్టార్ల పరిధిలో 54 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో 14 కేంద్రాలకు సొంతభవనాలు కరువయ్యాయి. చిమట, జి అగ్రహారం, చిలంకూరు, కాకర్ల, కెల్లంపల్లి (ఓసీ), కూపూడి, కూపూడి 2, ధర్మవరం, శివరాయునిపేట, ఓగిరాలవారి పాలెం, వేమవరం, అయ్యపురాజు పాలెం ఎస్సీ, జంగాలపల్లి కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అద్దెల భారం పెరగడంతో చాలీచాలని జీతాలతో కొట్టుమిట్టాడుతున్న కార్యకర్తలకు ప్రభుత్వం అందించే అద్దెలు సరిపోక కొంతచేతి చమురు వదిలించుకోవల్సి వస్తుందని వాపోతున్నారు. దీనికితోడు ఇటీవల చిన్నారులకు కేంద్రాలలోనే పౌష్టికాహారం వండివార్చాల్సి రావడంతో మౌలిక వసతులు లేక ఇబ్బందులుపడుతున్నారు. ఆయా గ్రామాలలో ఉన్న ప్రభుత్వస్థలాల్లో అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని వాకా వెంకటరెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసును కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి స్వామి చొరవ తీసు కొని దశలవారీగా నైనా అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ భవనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00



కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఈనాం భూముల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించండి

● కలెక్టర్‌కు టీడీపీ నేతల వినతి

సింగరాయకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండలంలో అపరిష్కృతంగా ఉన్న ఈనాం భూముల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని టీడీపీ నేతలు కలెక్టర్ రాజాబాబును కోరారు. ఆమేరకు సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసంలో ఆయనకు వినతిప్రం అందజేశారు. ఏళ్ల తరబడి క్రయవిక్రయాలు జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు 2014 నుంచి నిలిచిపోయాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్న స్థలాలు, భూములను అవసరాల నిమిత్తం అమ్ముకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, కొత్తూరి శ్రీరంగనాయకులు, మళ్లపూడి సత్యనారాయణ, యస్దాని, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



డీఆర్వో ఓబులేశును సత్కరిస్తున్న ఆర్డీవో, కలెక్టరేట్ సిబ్బంది

డీఆర్వోకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లారెవెన్యూఅధికారి(డీఆర్వో)గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న చిన ఓబులేశును ఘనంగా సత్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి కే లక్ష్మీప్రసన్న, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్, అసోసియేషన్ కోశాధికారి ఊతకోలు శ్రీనివాసులు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈసందర్భంగా ఏడాది కాలంలో డీఆర్వో ఓబులేశు అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగలక్ష్మీసాయి శ్రీనివాస్‌తో పాటు కలెక్టరేట్‌లోని సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.



డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని భగత్‌సింగ్ ఉచిత ట్యూషన్ సెంటర్ వద్దడైపీ జెండాను ఆవిష్కరించారు. కే వంశీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైపీ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు,యువతకు స్పూర్తిప్రదాతలు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్‌వంటి అమరుల త్యాగాలబాటలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైపీ నాయకులు పి. వెంకట్రావు, పీ రామకృష్ణ, శ్రీను, సురేష్, రాము, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, భావన్నారాయణ తదితరులు ఉన్నారు.



శుభ్రం చేసి నీరు తొలగించిన శర్మాకాలేజీ ఎదురు రహదారి

సమస్యపై స్పందించారు..

● శర్మ కాలేజీ రోడ్‌లో నీరు, చెత్త తొలగింపు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు శర్మాకాలేజి రోడ్ అధ్వాన్నంగా ఉందని, పూర్వ వైభవం కోల్పోయి పరిసరాలు మరింత దుర్గంధభరితంగా ఉన్నాయంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'శర్మాకాలేజి పరిసరాలు అధ్వానం' కథనంపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌కవేటర్‌తో పరిసరాలను బాగు చేసి, చెత్తను తొలగించి, వర్షపు నీరును దారి మళ్లించారు. కాగా సమస్య కొంతమేర పరిష్కారం అయినా, చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లు అలాగే వదిలేయడం వలన కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని కూడా మరోచోటకి మార్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



దీపక్‌గౌడ్



శ్రేయాన్ భక్షి

తైక్వాండో పోటీల్లో స్మార్ట్‌జన్ విద్యార్థుల ప్రతిభ

సింగరాయకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సింగరాయకొండలోని స్మార్ట్ జన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-12 విభాగం ఫైట్ పోటీల్లో రెండో తరగతి విద్యార్థి దీపక్‌గౌడ్, మూడో తరగతి విద్యార్థి శ్రేయాన్ భక్షి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇరువురు విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి అభినందించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

80 అడుగులకు ట్రంక్ రోడ్ విస్తరణ

సాదాసీదాగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం



కార్పొరేషన్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలవకర్గ సమావేశం సోమవారం సాదాసీదాగా సాగింది. నగర అభివృద్ధిలో భాగంగా 75 అంశాలను అజెండాలో పొందుపరచగా, దాదాపుగా అన్నింటికీ సభ్యులు ఆమోదం పలికారు. గత నెల 28న జరగాల్సిన కౌన్సిల్ సమావేశం మొంథా తుఫాన్ కారణంగా ఈనెల 3వ తేదీకి వాయిదా పడింది. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి జరిగిన ఈ సమాశానికి మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించగా, టీడీపీ, జనసేన, వైసీపీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరగ్గా, కొన్ని అంశాలపై వైసీపీ కార్పొరేటర్లు అనవసర రాద్ధాంతం చేశారు. కాగా అజెండా అంశాలలో కీలకమైన ట్రంక్ రోడ్ విస్తరణకు ఎట్టకేలకు ఆమోదం పడింది. తొలుత 100 అడుగులు విస్తరించాలని భావించగా, అటు వ్యాపారుల నుంచి వచ్చిన విన్నపాలపై 80 అడుగులకు ఒకే చేశారు. అలాగే రెండోదశలో మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు 80 అడుగుల రోడ్‌ను విస్తరించేందుకు ఆమోదం లభించింది. అలాగే శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు గడువు ముగియగా, మరో మూడు నెలలు పొడిగించారు. టీడీపీ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం వలన జరగబోయే భారీ నష్టాలను ముందుగా గుర్తించి నష్టాన్ని తగ్గించడంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ద న్ ఆధ్వర్యంలో ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు తెలిపారు. అలాగే కార్పొరేషన్‌కు అవార్డు లభించడం అభినందనీయం అన్నారు. అభివృద్ధి కోసం పొందుపరిచిన అజెండా అంశాలపై జరిగిన చర్చలో వైసీపీ, జనసేన కార్పొరేటర్లు అభ్యంతరం తెలియజేస్తూ మాట్లాడగా వెంకటరమణ్య తనదైని శైలిలో కౌంటర్ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

ఇప్పటికే చేపట్టిన రూ. 119 కోట్లు పనులు త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈదర వెంకట సురేష్ బాబు మాట్లాడుతూ ప్రగతి భవన్ నుంచి, స్టేడియం వైపు వాటర్ సమస్య ఉందని, అక్కడ కల్వర్టు నిర్మిస్తే తూర్పు వైపు ప్రవహిస్తాయని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో కమిషనరు కే. వెంకటేశ్వరరావు, ఎంఈ ఐశయ్య, ఏసీపీ ప్రసాద్‌తోపాటు ఇతర అధికారులు, టీడీపీ, జనసేన, వైసీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం

నగర సుందరీకరణలో భాగంగా నగర ప్రధాన కూడలిలను అందంగా తీర్చి దిద్దేందుకు మంగమ్మ కాలేజి జంక్షన్ వద్ద 30 అడుగుల సర్కిల్‌తో చేపట్టిన ఐ లాండ్ అభివృద్ధికి ఆమోదం తెలిపారు. అలాగే రామనగర్ 6వ లైను నుంచి 10వ లైను వరకు గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి, వాటితోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్‌లు, డ్రైన్‌లు, కల్వర్టులు ఇతరత్రా అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా సమర్థవంతంగా పనిచేసిన పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందిని కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. తుఫాన్ కారణంగా రేయింబవళ్లు కష్టపడి పనిచేయడంతో పాటు కార్పొరేషన్‌కు సైక్లోన్ మొంథా ఫైటర్స్ అవార్డు సాధనకు కృషి చేసినందుకు శాలువాలు కప్పి సన్మానించారు.

20 ఏళ్లుగా ఉంటున్నాం.. ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్తాం..!

తహసీల్దార్‌ను ప్రశ్నించిన అంబేడ్కర్ కాలనీ వాసులు



తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నిస్తున్న అంబేడ్కర్ కాలనీ వాసులు

సంతనూతలపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 20ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం..అన్ని వసతులు కల్పించారు.. ఇపుడు ఖాళీచేయండంటూ చెప్పడం అన్యాయమని స్థానిక ట్రిపుల్ ఐటీ కళాశాల పక్కన ఉన్న సర్వేనెంబరు 392/17 లోని అంబేడ్కర్ కాలనీ వాసులు వాపోతున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు మంగళవారం సాయంత్రం తహసీల్దార్ నారాయణరెడ్డి రెవెన్యూసిబ్బందితో అంబేడ్కర్ కాలనీ వద్దకు వెళ్లారు. కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు మీరుంటున్న ఇంటి స్థలానికి సంబంధించి మీవద్ద ఎటువంటి ఆధారం లేకుంటే ఖాళీ చేయాలని అనడంతో కొంతసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం అంబేడ్కర్ కాలనీ వాసులు మేము కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, అర్థంతరంగా ఇలా ఇబ్బంది పెట్టడం సబబుకాదని రెవిన్యూవారికి తెలిపారు. తమ కాలనీకి అన్ని సౌకర్యాలు కల్పించి ఇప్పుడు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు.

దీంతో తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ కోర్టు నిబంధనల మేరకు మేము పనిచేయాలని, అదేవిధంగా మీరుంటున్న ఇళ్లస్థలాలకు సంబంధించి ధ్రువీకరణపత్రాలు ఇవ్వాలని కాలనీవాసులను అడిగారు. దీంతో ధ్రువీకరణ పత్రాలు ఉన్నవాళ్లవరకు రెవిన్యూసిబ్బంది సేకరించారు. మీకు అవసరమైతే వేరొకచోట స్థలాలు వచ్చేవిధంగా ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. సేకరించిన సమాచారాన్ని పైఅధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. కాగా ఈసమస్యపై కాలనీవాసులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేసినట్లు తెలిపారు. ఒంగోలు ఆర్‌డీవో అంబేడ్కర్ కాలనీ వాసుల సమస్య పరిష్కార విషయమై మంగళవారం ఒంగోలు ఆర్‌డీవో కార్యాలయానికి రమ్మని చెప్పినట్లు కాలనీ వాసులు తెలిపారు.

మూడేళ్లుగా 'చుక్కలు' చూపిస్తున్నారు

ఇప్పటికి 8 సార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు

మీకోసంలో మరోసారి కనిగిరి వాసి ఆవేదన



ఆధారాలు చూపిస్తున్న గూడూరి రవికుమార్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తన నాన్న గూడూరి లాజరస్ మాజీ (సైనికుడు) సబేదారుగా పనిచేసినందుకు 1978లో ప్రభుత్వం 2.43 సెంట్లు భూమి ఇచ్చింది. ప్రస్తుతం ఆ భూమిని చుక్కలు భూమిగా చూపిస్తూ తనకు మూడేళ్లుగా చుక్కలు చూపిస్తున్నారని కనిగిరికి చెందిన గూడూరి రవి కుమార్ వాపోయారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒంగోలులోని స్పందనలో కలెక్టర్ రాజాబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కనగిరి గ్రామ సర్వే నెం. 901/2ఏలో 2.43 ఎకరాల భూమిలో ఒక ఎకరం అమ్ముకోవాలని సబ్-డివిజన్ కోరగా, చుక్కల భూమి అని అధికారులు రాసి ఇవ్వడం దారుణమన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని కనిగిరి తహసీల్దార్‌ను ఎన్నిసార్లు కలిసినా ఫలితం లేదని వాపోయారు. కనీసం పీజీఎస్ కూడా వెళ్లకుండా తనను మభ్యపెడుతూ అందుకు సంబంధించిన రికార్డులను మాయం చేశారని తెలిపారు. ఆర్మీ ల్యాండ్‌ను చిన్న మార్పులు చేసి, చుక్కలు భూమిగా చూపి తనకు తీరని అన్యాయం చేశారని, మూడేళ్లుగా ఎనిమిదిసార్లు అర్జీలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని, జిల్లా ఉన్నతాధికారులు తన సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీహైస్కూల్ విద్యార్థులు

సంతనూతలపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రమోద తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 1న మద్దిపాడు మండలంలోని కోరుమూడివారిపాలెంలో అండర్-14, 17 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించారు. వీరిలో సంతనూతలపాడు జడ్పీహైస్కూల్ బాలికలు ఎంపికయ్యారు. ఎంపికైన బాలికలు 7,8,9 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన బాలికలను అభినందించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదలకు కుళ్లిన పొగాకు నారుమళ్లు

● నష్టాల బారిన రైతులు

ఒంగోలు(రూరల్),నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండు పరిధిలో సాగు చేసిన పొగనారు వరదలతో పూర్తిగా ధ్వంసం అయ్యింది. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పొగనారు మడులపై నాలుగు ఐదు అడుగుల లోతున వరద ప్రవాహం జరగటంతో మట్టి మేట వేసి ఎండిపోయాయి. మద్దిరాలపాడు దగ్గర అయితే పది అడుగులపై లోతున ప్రవాహం జరిగింది దీంతో పొగనారు మళ్లు కుళ్లిపోయాయి. ఒక్కో ఎకరాకి నారుమడి సాగు చేసిన రైతులు లక్షన్నరపైగా ఖర్చు చేశారు. మొదటి విడతగా పీకుడుకు వచ్చిన పొగనారు దెబ్బతినిపోవటంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఒంగోలు రెండు పరిధిలో గుండ్లకమ్మనదీ తీరంలో ఉలిచి దగ్గర,మద్దిరాల పాడు , కేశినేనివారిపాలెం, అమ్మనబ్రోలులో సుమారు 16హెక్టారులలో సాగు చేసినట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం కూడా పొగ తోటలసాగుకు ఖర్చులు పెరిగే పరిస్థితులు ఉన్నాయి.

53 ఎకరాలలో పంట నష్టం

మద్దిపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):తుపాన్ వల్ల 53 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి జి.స్వర్ణలత తెలిపారు. నష్టానికి సంబంధించిన వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించినట్లు ఆమె చెప్పారు. వర్షం కారణంగా మొక్కజొన్న, వరి, మినుము పైర్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. దొడ్డవరం, గుండ్లాపల్లి, రాచవారిపాలెం, కొత్తపల్లి గ్రామాలకు చెందిన దాదాపు రెండు వందల మంది రైతులకు చెందిన వరి, మినుము, మొక్కజొన్న రైతులు నష్టపోయారన్నారు. శనగ విత్తనాలను 25 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.


ఉలిచి శ్మశానాన్ని అభివృద్ధి చేస్తాం

ఒంగోలు(రూరల్),నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఉలిచి గ్రామపరిధిలోని శ్మశానంను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎంపీడీవో కె.రాజశేర రావు అన్నారు. మండలంలోని ఉలిచి గ్రామపరిధిలో గల శ్మశానాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శ్మశానం విస్తీర్ణంను రెవెన్యూ అధికారులతో కొలతలు వేయిస్తామని తెలిపారు. శ్మశానం చుట్టూ ప్రహరీతోపాటు మెరక చేయిస్తామన్నారు. దీనికి తోడుగా కర్మకాండలు నిర్వహించుకోవటానికి షెల్టర్‌ను నిర్మిస్తామని తెలిపారు. ఏపీవో నాగేశ్వరరావు, గ్రామనాయకుడు చుంచు శింగయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసి అదుకోండి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మండలంలో దళితులకు చెందిన భూములను అసైన్‌మెంట్ రికార్డులను పరిశీలించకుండా తప్పుడు నివేదికలు ఇస్తున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని దళితులు డిమాండ్‌చేశారు. మార్కాపురంకు చెందిన దళితులు చేబ్రోలు ఇస్సాక్, నిశనం బాలవీరయ్యల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూముల రికార్డులను పరిశీలించి దళితులకు న్యాయంచేయాలని డిమాండ్‌చేశారు. రికార్డులు పరిశీలించకుండా తప్పుడు నివేదికలు ఇస్తున్న తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలోపలువురు దళితులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ముక్తినూతలపాడు విద్యార్థిని



పల్లవి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముక్తినూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం. పల్లవి ఆదివారం ఒంగోలులోని మినీ స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్స్ బాలికల విభాగం కబడ్డీ పోటీలలో ప్రతిభ చాటారు. కాగా ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో స్థానం పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈ.దేవసేన, ఫిజికల్ డైరెక్టర్ జి.ప్రభాకర్, పీఈటీ రామాంజిబాబు పలువురు పల్లవిని అభినందించారు.



సరస్వతీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు

జయహో.. భారత్..!

● వరల్డ్ కప్ సాధించిన మహిళా జట్టుకు జేజేలు

మహిళల వరల్డ్ కప్ క్రికెట్ పోటీలలో తొలిసారిగా విజయం సాధించిన మహిళా భారత్ జట్టుకు ఒంగోలు జనం జేజేలు పలికారు. ఈ మేరకు సోమవారం సరస్వతీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో హర్షధ్వానాలు చేశారు. మహిళ అన్నీ రంగాల్లో రాణిస్తుందని చెప్పడానికి ఇదే నిదర్శనమని, భారత కీర్తి ప్రతిష్టలను నలు మూలలా చాటి చెప్పిన భారత్ మహిళా క్రికెట్ జట్టుకు వారు అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంతోషాలు పంచుకున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



అధికారులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

స్పెషల్ ఆఫీసర్, అధికారులకు సత్కారం

సంతనూతలపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ ప్రభావం వలన మండలంలోని ఎటువంటి ప్రాణనష్టం, పశు, ఆస్తినష్టం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిన మండల స్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి అధికారులైన ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎస్సై వి.అజయ్‌బాబు, పలువురు పంచాయతీ కార్యదర్శులను సోమవారం రాత్రి మండలపరిషత్ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు, మండల ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరిశ్రీను, తెలుగు యువత ముప్పరాజు శ్రీను, బి.చంద్రశేఖర్, బి.శంకర్, శ్రీరామూర్తి, గోపి, నారాయణస్వామిచౌదరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వనాథుడు



సంతనూతలపాడులో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సింగరాయకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్పదేవస్థానంలో కాశీవిశ్వనాథుడికి అభిషేకం చేశారు. మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. పాకల శివాలయంలోని గంగాసమేత కాశీవిశ్వనాథుడిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఆలయాల్లో కార్తీక సోమవారం వేడుకలు

సంతనూతలపాడు : మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంతనూతలపాడు త్రిపురాంతకస్వామివారి ఆలయంలో, నాగేంద్ర సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలోను, పేర్నమిట్ట పార్వతిసమేత రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నిందితులను అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం బండ్లమూడి మాదిగ పల్లెపై దాడి చేసిన అగ్రకులాల వారిపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్‌మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, ఇన్‌ఛార్జ్ తిరువీధి బాబు డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను వారు పరామర్శించారు.

పంట ఉత్పత్తుల ధరలు పతనం

» తగ్గిన శనగలు, కందులు, కొర్రలు, ఉలవల రేట్లు
» నష్టాల్లో రైతులు, వ్యాపారులు

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రోజురోజుకు దిగజారి పోతున్నాయి. దాంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితిని రైతులు చూస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధరల కంటే రోజురోజుకు రేటు తగ్గిపోతుండడంతో నష్టాలబారిన వ్యాపారులు పడుతున్నారు. ముఖ్యంగా శనగలు, కందులు, కొర్రలు, ఉలవల రేట్లు రోజురోజుకూ తగ్గుతున్నాయి. పప్పుశనగ గత ఏడాది క్వింటా రూ.6,400 ఉండగా ఈ సీజన్‌లో పంట దిగుబడి మొదలయ్యే సమయంలో రూ.6వేలు పలికింది. ప్రస్తుతం ధరలు దిగజారి రూ.5,500 నుంచి రూ.5,700 వరకు ఉన్నది. ధరలు పెరుగుతాయని కొంతమంది రైతులు శనగలను తమ ఇళ్లల్లో, కోల్డ్‌ స్టోరేజీలలో నిలువ ఉంచగా, రోజురోజుకు ధరలు తగ్గడంతో నష్టంతోపాటు కోల్డ్‌స్టోరేజీల అద్దె భారం కూడా రైతుల మెడకు చుట్టుకుంటున్నది. ఇక వ్యాపారుల విషయానికి వస్తే రూ.6వేల ధరతో కొనుగోలు చేసిన శనగలు క్వింటాకు రూ.500 దాకా తగ్గడంతో లారీ మేర స్టాక్‌ పెట్టిన వారికి సుమారు లక్ష రూపాయల మేర నష్టం వస్తున్నది. తెల్ల శనగలు గత ఏడాది రూ.10వేలు పలుకగా ఈ ఏడాది మార్చిలో పంట ఉత్పత్తి సమయంలో రూ.6,700 పలికింది. కానీ ప్రస్తుతం రూ.5,500 నుంచి రూ.5,700 ధర ఉండడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. సగం మంది రైతులు గత ఏడాది ధరలను దృష్టిలో పెట్టుకుని ఆ రేటు కోసం ఎదురు చూస్తూ ధరలు ఇంకా తగ్గడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. కొర్రలు గత ఏడాది రూ.3,400 పలుకగా ప్రస్తుతం రూ.2,200 నుంచి రూ.2,400 పలుకుతున్నది. గతంలో కొనుగోలు చేసిన స్టాక్‌లు కోల్డ్‌ స్టోరేజీల్లో మగ్గుతుండగా క్వింటాకు రూ.1000 మేర తగ్గడంతో వ్యాపారులు లబోదిబో మంటున్నారు. కందుల విషయానికి వస్తే కోత దశలో రూ.6,400 ఉండగా ప్రస్తుతం రూ.5,500 మేర ధర ఉన్నది. గత ఏడాది ఇదే సీజన్‌లో కందుల రూ.11,800 ధర పలికింది. ఆ రేట్లను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి కోల్డ్‌ స్టోరేజీల్లో నిలువ ఉంచుకోగా ధరలు రోజురోజుకూ పాతాళానికి వెళ్తుండడంతో ఆందోళనలో ఉన్నారు. రేట్లు పెరుగుతాయని 40 నుంచి 50 శాతం మేర రైతులు ముఖ్యంగా తెల్ల శనగలు, కందులను అమ్మకుండా నిలువ ఉంచుకోగా రోజురోజుకు రేట్లు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలను ప్రకటించి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


గోడౌన్‌లో నిల్వ ఉన్న పలు పంట ఉత్పత్తులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాయిబాలాజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలి సోమవారం తెలిపారు. ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు డి.శ్రీభువనశ్రీ, కె.అభిలాష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ వలిని అభినందించారు.

చదరంగంలో..

జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పీడీ జాహ్నవిప్రియలు తెలిపారు. పాఠశాలకు చెందిన షణ్ముఖి, ప్రహేళికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదే విధంగా జ్యోతి రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.


శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న ఏవో, నాయకులు

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ

మార్కాపురం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామంలో రైతులకు రాయితీపై శనగ విత్తనాలను వ్యవసాయాధికారి బుజ్జిబాయి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మార్కాపురం, మిట్టమీదిపల్లి సొసైటీ అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి, గొలమారి నాసర్‌రెడ్డి, కనీస వేతనాల సలహా కమిటీ సభ్యుడు కాకర్ల శ్రీనివాసులు పాల్గొని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌ను చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలకు నష్టం వచ్చినప్పుడు ఈ-క్రాప్‌ను ఆధారంగా చేసుకొనే పరిహారాన్ని అందజేస్తారని రైతులకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకుడు గొలమారి కాశిరెడ్డి, దూదేకుల మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత వైద్యం అందించాలని రిటైర్డ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మెడికల్ బిల్లుల మంజూరులో 50శాతం కూడా ఇవ్వకపోవడంతో పింఛనర్లకు ఆర్థిక భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ధరల సూచిక ప్రకారం ప్యాకేజీ రేట్లు సవరించాలని కోరారు. ఈహెచ్‌ఎస్‌పై అందించే వైద్యం రూ.2లక్షల నుంచి కనీసం రూ.5లక్షలకు పెంచాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు గతంలో రిటైర్డ్ అయిన కార్యాలయం నుంచి కాకుండా ఎస్‌టీవోల ద్వారా పంపించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రోబోటిక్ వైద్యం అందించాలని, ఎయిడెడ్ పింఛనర్లకు కూడా మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, ఇతర రాష్ట్రాలలో ఈహెచ్‌ఎస్ వైద్యశాలల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న వసంతలక్ష్మి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కొనకనమిట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సతీమణి కందుల వసంత లక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. చినారికట్ల, నాగంపల్లి, తువ్వపాడు, సిద్దవరం, ఇరసలగుండం, పాతపాడు, కొనకనమిట్ల తదితర గ్రామాలలో ఇటీవల పలు వ్యాధులతో చికిత్స పొందిన 12 మందికి రూ.4,36,778 చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదల ఆరోగ్యంపట్ల ప్రజా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, తాతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, రేగడపల్లి సొసైటీ అధ్యక్షుడు కనకం నరసింహారావు, చినారికట్ల సొసైటీ అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, కుందూరు కాశిరెడ్డి, మువ్వా కాటంరాజు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు స్థలం కేటాయించాలి


ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు

మార్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీకి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సోమవారం మీ కోసం కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మొర్రిబోయిన చిన్నయ్య మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు గృహ సముదాయం నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. దేశ రక్షణ కోసం పాటుపడిన వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు శీలం హరినారాయణరెడ్డి, సెక్రటరీ ఆరికట్ల వెంకటనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు మాదాసు శ్రీనివాసులు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు సక్కు వెంకటేశ్వర్లు, దర్శనం నాగయ్య, పుల్లయ్య, రామకృష్ణారెడ్డి, ఇండ్లా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

4న మండల స్థాయి చెకుముకి సంబరాలు

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక బోర్డు స్కూల్‌లో నవంబరు 4వ తేదీన ఉదయం 9గంటలకు మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహిస్తామని మండల శాఖ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సద్దాం హుస్సేన్, అధ్యక్ష, కార్యదర్శులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, నారపరెడ్డి, చెకుముకి కన్వీనర్ షేక్ నాయబ్ రసూల్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చెకుముకి పరీక్షలలో 8.9, 10వ తరగతుల్లో ప్రథమ స్థానం సాధించిన ముగ్గురు విద్యార్థులు జట్టుగా ఏర్పడి మండల స్థాయి పరీక్షకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు కార్యక్రమానికి సహకరించవలసిందిగా కోరారు.

అనుములపల్లిలో ఇంటింటా స్వదేశీ

రాచర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు భవనాసి వెంకట రామాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా స్వదేశీ - ప్రతి ఇంటా స్వదేశీ (మేక్ ఇన్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా) అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటింటికీ తిరిగి కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేశారు. బూత్ కమిటీలు నియామకం పార్టీలోకి నూతనంగా వ్యక్తుల ఆహ్వానం కేంద్రం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు తెలియజేయడం, అధికారులను కలవడం కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో నాయకులు దూదేకుల మహేష్, గిద్దలూరు పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, ఖాదర్‌వలి పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న బీజేపీ నాయకులు

హసనాబాద్ రహదారి బురదమయం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» పట్టించుకోని అధికారులు

పెద్ద దోర్నాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హసనాబాద్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మురికి కూపంగా మారింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు గ్రామం నుంచి బయటకు వెళ్లి తిరిగి రావాలంటే నరకం చూస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై వరద నీరు కాలువలా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలువురు బురదలో జారిపడడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ఎంపీపీ అయిన గుమ్మా పద్మజ భర్త రూ.2.5లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టిన క్రమంలో రెండు వైపులా ఎక్సకవేటర్‌తో కొంత భాగం చదును చేశారు. కాని తదనంతరం పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. నెలకు పైగా వానలు కురుస్తుండడంవల్ల బురదమయంగా మారింది. గ్రామ ప్రజలు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


హసనాబాద్‌కు ప్రధాన రోడ్డుపై ఉన్న బురద, నీరు

వర్షాల వల్లే జాప్యం

- నాసర్‌రెడ్డి, ఎంపీడీవో

హసనాబాద్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంపై ఎంపీడీవో నాసర్ రెడ్డిని వివరణ కోరగా వర్షాల కారణంగా జాప్యం జరిగిందని త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

భర్తను కోల్పోయిన భార్యకు పెన్షన్

రాచర్ల, న వంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పెన్షన్ పొందుతున్న భర్త మరణిస్తే అతని పెన్షన్‌ను వెంటనే భార్యకు అందిస్తామని రామాపురం సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ భవనం పుల్లారెడ్డి అన్నారు. మండలంలోని ఎడవల్లి గ్రామానికి చెందిన మట్టిమల్ల దేవ సహాయం సామాజిక పెన్షన్ పొందుతూ మరణించగా అతని పెన్షన్ సొమ్మును అతని భార్య మార్తమ్మకు సోమవారం ఆయన పంపిణీ చేశారు. గ్రామంలో అదేవిధంగా 5మందికి పెన్షన్ పొందే అవకాశం కలిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. పెన్షన్ పొందుతున్న భర్త చనిపోయిన వెంటనే ఆ పెన్షన్ సొమ్మును భార్యకు ఇచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీరామ్ రంగయ్య, సచివాలయ సిబ్బంది పద్మజ, లక్ష్మీకాంత్ రెడ్డి, విఆర్ఏలు సురేష్ రమణ పాల్గొన్నారు.


పెన్షన్ పంపిణీ చేస్తున్న ఛైర్మన్ పుల్లారెడ్డి

వైభవంగా కార్తీక సోమవారం


గిద్దలూరులో ప్రవచనాలు చేస్తున్న రాధామనోహర్‌దాస్


త్రిపురాంతకంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

» శివాలయాలకు భక్తుల తాకిడి
» నిర్వాహకుల ప్రత్యేక ఏర్పాట్లు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రెండో సోమవారం మార్కాపురం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరుణ్‌తేజశర్మ, ఆంజనేయశర్మ జగదాంబ, మార్కండేశ్వర స్వాములు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మార్కండేశ్వరునికి పుష్ప లింగాకారంలో విశేష అలంకరణలు నిర్వహించారు. ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాలు నిర్వహించారు.

గిద్దలూరు : శివాలయాలలో కార్తీక సోమవార పూజలు వైభవంగా జరిగాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి కుటుంబీకులు కార్తీక సోమవార పూజల్లో పాల్గొన్నారు. దేవస్థాన ఈవో శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు అనిల్‌స్వామి, కమిటీ ప్రతినిధులు తహసీల్దార్‌కు జ్ఞాపికను అందచేశారు. కేఎస్ పల్లి సమీపంలోని భీమేశ్వరస్వామి దేవాలయంలో, ముండ్లపాడు, పలుపులవీడు శివాలయాలలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

కార్తీక మాస పూజలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో 3 రోజులుగా జరుగుతున్న కార్తీక పూజల్లో భాగంగా అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. వేలసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభయ హిందూసేన వ్యవస్థాపకులు రాధామనోహర్‌దాస్ స్వామీజీ చేసిన ప్రవచనాలు అందరినీ ఆలోచింప చేశాయి. నిర్వాహకులు పోలంరెడ్డి బాలక్రిష్ణారెడ్డి, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి యర్రారెడ్డి పాల్గొన్నారు.

5న రుద్రాభిషేకం

కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో ఈ నెల 5వ తేదీన రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీకుసుమ హరనాథ భక్త సమాజం అధ్యక్షుడు నటుకుల శ్రీనివాసులు, కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తేదీ బుధవారం ఉదయం 6.30 గంటలకు సామూహిక రుద్రాభిషేక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు జ్వాలాతోరణం, కోటి దీపార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రాచర్ల : కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా శ్రీ సిద్ధిభైరవేశ్వర ఆలయం, సత్యవోలులోని శ్రీ రామలింగేశ్వర ఆలయం, అక్కపల్లి గ్రామ సమీపంలోని శ్రీ కనక సురభేశ్వర ఆలయం, రాచర్లలోని శ్రీ రామలింగేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

పెద్దదోర్నాల : సాయిబాబా మందిరంలో సోమవారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు దీపాలను వెలిగించి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

త్రిపురాంతకం : త్రిపురాంతకం దేవస్థానంలో కార్తీక సోమవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకోసం ఆలయ ఈవో అనిల్‌కుమార్, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ సుబ్బారావులు ప్రత్యేక ఏర్పాట్లతో పర్యవేక్షిస్తున్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం


బహుమతులను అందిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిస్థాయి నుంచే భారత రాజ్యాంగం, శాసన వ్యవస్థలపట్ల అవగాహన ఉండాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీల విజేతలకు సోమవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవోలు రాందాసునాయక్, శర్వాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. నూరానీ, రమ్యశ్రీ, దినేష్‌నాయుడు, వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు. విజేతలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.అశ్వనీకుమార్, పి.నాగభూషణ్‌రెడ్డి, గిరిధర శర్మ, రత్నం, పలు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

దశలవారీగా కుక్కలకు స్టెరిలైజేషన్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దశలవారీగా కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, పలు వీధుల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటి వరకు 432 కుక్కలకు ఒంగోలులో స్టెరిలైజేషన్ చేయించామన్నారు. త్వరలో సత్తెనపల్లిలో కూడా ఈ ప్రక్రియ ద్వారా 230 కుక్కలకు స్టెరిలైజేషన్ చేయిస్తామన్నారు. పట్టణంలోని కాలేజీ రోడ్డులో పిచ్చికుక్క కరిచిన వారిని ఆయన పరామర్శించారు.

గ్రంథాలయాన్ని పరిశీలించిన తహసీల్దార్


పరిసరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాన్ని మండల తహసీల్దార్ డీ మంజూనాథరెడ్డి సోమవారం పరిశీలించారు. ఇటీవల గ్రంథాలయ అవరణలో ఆకతాయిలు చేస్తున్న అల్లర్లపై పోలీసులకు, తహసీల్దార్‌కు గ్రంథపాలకురాలు కే ఝాన్సీ ఫిర్యాదు చేశారు. గ్రంథాలయ స్థలం, ప్రహరీ, గోడ విషయంలో ఉన్న సమస్యపై వారికి ఆమె వినతిపత్రం అందజేశారు. దీనితో తహసీల్దార్, ఆర్ఐ సర్దార్, మండల సర్వేయర్ సిలార్‌ఖాన్ లతో కలసి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆనంతరం చుట్టుపక్కల నివాసాలు ఉండే వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు గ్రంథాలయంలో అందించే సేవలను వినియోగించుకోవాలే కానీ ఇలా ఆకతాయి పనులు చేయడం మంచిది కాదన్నారు. మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే నివాస ప్రాంతాలలో తప్ప గ్రంథాలయ పరిసరాలలో చెత్త చెదారం వేయకుడాదని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణ చౌదరి అక్కడే ఉన్న కోనేరును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు దృష్టికి తీసుకొచ్చారు.

ఘనంగా తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎం కాంపౌండ్‌లోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి 28వ సంఘ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన సత్య సువార్తరాజు ముఖ్య ప్రసంగీకులుగా హాజరై మాట్లాడారు. శాంతి, ప్రేమ బోధించిన ఏసు బోధనలు మానవాళిని మంచి మార్గంవైపు నడిపించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు శామ్యూల్, ఉపాధ్యక్షుడు ఆర్దర్, కార్యదర్శి జయరావు, సంఘ కాపరి అమృత తేజ్, సభ్యులు బాబీ, సతీష్, పోలయ్య పాల్గొన్నారు.


గీతాలను ఆలపిస్తున్న క్రైస్తవులు

సీఐని కలిసిన టీడీపీ శ్రేణులు

పామూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మాకినేని శ్రీనివాసరావును సోమవారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీఐను శాలువాతో సత్కరించి బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, పువ్వాడి వెంకట్‌చౌదరి, దైండే శివశంకర్, రామారావు ఉన్నారు. అలాగే, ఆదివారం రాత్రి టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొబ్బూరి రాజేష్, డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, చెరుకుపల్లి వెంకటరెడ్డి, ఎస్సీ మాలకొండయ్య, వి.రామకృష్ణంరాజు, గంటిమడుగు శ్రీనివాసవర్మ, సీఐ శ్రీనివాసరావును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

దొనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈనెల 8,9 తేదీల్లో దర్శిలో జరగనున్న మహాసభల సందర్భంగా సోమవారం దొనకొండలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య, ఉపాధ్యక్షుడు పి.లూకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసాబేగం అన్నారు. ఒకేషనల్ ట్రైనర్‌లు బీవీ రాధాకృష్ణ, ఎం.రవి, పి.మహేష్‌ల పర్యవేక్షణలో 9, 10 తరగతుల విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు చేసి ప్రదర్శించారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 77వేలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,77,445 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.75,310, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,610, శాశ్వత అన్నదాన పథకానికి రూ.47,495, పంచామృత అభిషేకానికి రూ.11,032 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

బాధితురాలికి సాయం

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డి.లక్ష్మీదేవి అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. ఈక్రమంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మానవత సంస్థ సహాయాన్ని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాధితురాలి కుమార్తె మణిచందనకు సంస్థ తరుపున రూ.5 వేలు, పాఠశాల తరుపున ఉపాధ్యాయులు రూ.5 వేలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు వి.వెంకటేశ్వరరెడ్డి, టి. వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం నాయుడు రవి, ఉపాధ్యాయులు రావిళ్ల నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కనిగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై ఎస్‌ఐ టి.శ్రీరాం తన సిబ్బందితో సోమవారం ఆకస్మిక దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీలో నివాసాల మధ్యం కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి రూ.7వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృత్త్యంతర శిక్షణతో ఉపాధి అవకాశాలు

కనిగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వృత్త్యంతర శిక్షణ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం కలవ విజయలక్ష్మి అన్నారు. స్థానిక హైస్కూల్‌లో సోమవారం 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు వృత్త్యంతర శిక్షణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్త్యంతర శిక్షణలో బాలికలకు వ్యాపార రంగానికి, సౌందర్యానికి సంబంధించిన నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అందులోభాగంగా విద్యార్థినులకు వివిధ వ్యాపారులు, కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

దొనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎఫ్రాయిమ్(నాని) అన్నారు. మహిళల వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భారత్ విజేతగా నిలిచిన సందర్భంగా సోమవారం కళాశాలలో విద్యార్థినులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా, కవిత, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా జగనన్న కాలనీలు

- కుంటలా చేరిన వర్షపునీరు
- చిల్లచెట్లు పెరిగి చిట్టడవిలా మారిన వైనం
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా


వెంకటచలంపల్లి కొండవద్ద జగనన్న కాలనీ ముందు కుంటలా చేరిననీరు

దర్శి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన జగనన్న లేఅవుట్లు అధ్వానంగా మారాయి. వర్షాలకు నీరుచేరి కుంటలా మారాయి. అంతకుముందు పెరిగిన పిచ్చిచెట్లు అల్లుకొని చిట్టడవిలా తయారయ్యాయి. కాలనీల్లో గృహాలను నామమాత్రంగా నిర్మించారు. అధికశాతం లబ్ధిదారులు అక్కడకు చేరేందుకు సుముఖత చూపకపోవటంతో ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.

దర్శి పట్టణవాసులకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో వెంకటచలంపల్లి కొండవద్ద 2518 పాట్లు కేటాయించారు. ఆకాలనీకి 498 గృహాలు మంజూరు చేశారు. ఇప్పటివరకు 104 గృహాలు మాత్రమే పూర్తయ్యా యి. మిగిలిన 285 గృహాలు అలాగే మిగిలిపోయాయి. మరికొన్ని పునాదుల్లోనే నిలిచిపోయాయి. ఈ కాలనీల అభివృద్ధి కోసం గత వైసీపీ ప్రభుత్వం రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేసింది. లబ్ధిదారులు అక్కడకు వెళ్లకపోవటంతో ప్రజాధనం వృథాగా మారింది.


పిచ్చిచెట్లు మొలచి అడవిగా మారిన జగనన్న కాలనీ

అలాగే, దర్శి రూరల్‌లోని గ్రామాలకు జగనన్న కాలనీల్లో 1292 ప్లాట్లు ఏర్పాటుచేశారు. 401 ఇళ్ల నిర్మాణం చేపట్టగా కేవలం 68 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 333 గృహాలు అలాగే మిగిలిపోయాయి. వెంకటచలంపల్లి, చందలూరు, బండివెలిగండ్ల, తూర్పుచౌటపాలెం, సామంతపూడి గ్రామాల్లో ఒక్క గృహం కూడా పూర్తి కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని జగనన్న కాలనీల అభివృద్ధికి సుమారు రూ.4 కోట్లకు పైగా ఖర్చుచేశారు. దర్శి పట్టణవాసులకు వెంకటచలంపల్లి వద్ద ఏర్పాటుచేసిన జగనన్న కాలనీకి ముందు గతంలో కొండ నీరు నిల్వ చేసేందుకు చెక్‌డ్యామ్ కట్టారు. ప్రస్తుతం ఈ వర్షాలకు చెక్‌డ్యామ్‌కు నిండుగా నీరు చేరింది. ప్రస్తుతం జగనన్న కాలనీ కొండకు, చెక్‌డ్యామ్‌కు మధ్యలో ఉంది. ఆ కాలనీకి ఏర్పాటుచేసిన మట్టిరోడ్డు కూడా అధ్వానంగా మారటంతో ఆ కాలనీ వృథాగా మారింది. అధికారులు గృహాలు నిర్మించుకోకపోతే ప్లాట్లు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ


బండివెలిగండ్ల జగనన్న కాలనీలో పిచ్చిచెట్లు మొలచి కుంటలా చేరిన నీరు

అనేక మంది లబ్ధిదారులు ప్లాట్లు వదులుకున్నారు. గత వైసీపీ పాలకులు, అప్పటి అధికారులు వాగులు, వంకల పక్కన కొండ ప్రాంతాల్లో, చౌడు భూముల్లో అధికశాతం కాలనీలు ఏర్పాటుచేయటంతో నిరుపయోగంగా మారాయి.

భక్తిశ్రద్ధలతో కలశ మహాసంప్రోక్షణ

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్‌నగర్ కాలనీలోగల శ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో సోమవారం నిర్వహించిన సహస్ర కలశ మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేక మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ శిఖరంపై ఉన్న కలశానికి పవిత్ర గంగా జలంతో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర దేవస్థానంలో, యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగ్రను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, డైరెక్టర్ చిలకపాటి మధు, జిల్లా అధ్యక్షురాలు వినకొండ శ్యామల, టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, నొస్సం నాగేంద్రచారి, పందిటి హరీష్, ఎం.దొరసానచారి, తదితరులు పాల్గొన్నారు.


కలశ సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర


శివలింగ ఆకారాన్ని దీపాలతో వెలిగిస్తున్న భక్తులు

కార్తీక శోభ

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా సీఎస్‌పురం మండలంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా నారాయణస్వామి దేవస్థానంలో మహిళా భక్తులు శివలింగం ఆకారాన్ని ప్రమిదలతో వెలిగించారు. తదనంతరం నారాయణస్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. భైరవకోన క్షేత్రంలో కార్తీక సోమవారం సందర్భంగా ఏర్పాట్లను ఈవో వంశీకృష్ణారెడ్డితో కలిసి పామూరు దేవస్థాన ఈవో నరసింహబాబు పరిశీలించారు.


భైరవకోనలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈవోలు

పక్కాగృహాల కోసం ఎదురు చూపులు

- మంజూరు కాని నిధులు
- సర్వేతోనే కాలయాపన

పామూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పీఎంఏవైకే 2.0 గృహాల మంజూరు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. గత డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం ఈపథకం కింద మండలానికి సుమారు 12 వందల పక్కా గృహాలు మంజూరు చేసింది. ఈపథకం కింద యూనిట్ విలువ రూ.2 లక్షల 25 వేలుగా ప్రకటించారు. ఎస్టీ లబ్ధిదారులకు రూ.లక్ష, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఓసీ లబ్ధిదారులకు రూ.25 వేలు అదనంగా మంజూరవుతాయని అధికారులు తెలిపారు. దాంతో పట్టణంలో స్థలం ఉన్నవారు సొంతింటి కల నేరవేరుతుందనే ఆశతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల ఆదేశాలతో లబ్ధిదారులకు సంబంధించి ఇంటి పత్రాలు, స్థలం కొలతలు తీసుకొని సర్వే నిర్వహించి గృహ నిర్మాణ శాఖ అధికారులకు అందజేశారు. సర్వేలు పూర్తిచేసి 15 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎటువంటి అనుమతులు రాకపోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈవిషయంపై గృహనిర్మాణశాఖ అధికారులను వివరణ కోరగా లబ్ధిదారులు ఇంకా ఎవరైన ఉంటే దరఖాస్తులు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించమని ఎవరికి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు వస్తే గాని పనులు ప్రారంభించాలని సూచిస్తున్నట్టు చెప్పారు. ఇంకా పీఎంఏవైకే 2.0 గృహాల మంజూరు కోసం అర్హత కలిగిన లబ్ధిదారులు సంబంధిత గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు దరఖాస్తు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్టు గృహనిర్మాణశాఖ అధికారులు తెలిపారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం పార్టీ అనుబంధ కమిటీల నియోజకవర్గ అధ్యక్షులను ఆయన సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పార్టీ బలోపేతం కృషి చేసిన వారికి తగిన గౌరవం లభిస్తుందన్నారు. అందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, లీగల్‌సెల్, కల్చరల్, రైతు, విద్యార్థి సంఘాలు, వాణిజ్య, వ్యాపార, విభిన్న ప్రతిభావంతులు, తెలుగు మహిళ, తెలుగుయువత అధ్యక్షుల పదవులను కల్పించి సముచిత స్థానం ఇవ్వటం జరిగిందన్నారు. జంషీర్ అహ్మద్ ఐటీడీపీ రాష్ట్ర నాయకులుగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను సోషల్‌మీడియాలో చురుకుగా ప్రచారం చేయటంతో పాటు, పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీకి మంచి పేరుకు తీసుకురావటం అభినందనీయమన్నారు. తెలుగుమహిళా అధ్యక్షురాలిగా నియమితులైన స్వప్న పార్టీ కార్యక్రమాల్లో చురకుగా పాల్గొనటమే కాకుండా పార్టీకి మరింత బలం పెరిగేలా వివిధ సేవలను ప్రజలకు అందించారన్నారు. ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రెండోసారి కూడా బలసాని కోటయ్య నియామకం ఆయన పార్టీకి చేసిన సేవలకు



మైనారిటీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికైన జంషీర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

నిదర్శనమన్నారు.

దొడ్డా వెంకటసురేష్‌రెడ్డిని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా, టీఎన్‌ఎఫ్ అధ్యక్షుడిగా షేక్ అఫ్రోజ్‌ను నియామకం చేయటం పట్ల యువతకు ప్రాధాన్యత టీడీపీలోనే సాధ్యమని మరోసారి రుజువు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్టీఆర్), మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తాతాపూడి స్టాలిన్(బుజ్జన్న), పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

కనిగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాచవరంకు చెందిన 6వ వార్డు కౌన్సిలర్ పోతిరెడ్డి రాజారెడ్డి వైసీపీని వీడి 15 కుటుంబాలతో సోమవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయనకు డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. అదేసమయంలో పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని గ్రామంలో విజయవంతంగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, బుల్లా బాలబాబు, సిద్దాంతి బారాయిమాం తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ రాజారెడ్డి తదితరులు


సిలిండర్ల పనితీరును పరిశీలిస్తున్న ఎంవీవో అధికారి రవికుమార్

ప్రైవేట్ బస్సుల తనిఖీ

పామూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పామూరులో ట్రావెల్స్ బస్సులను సోమవారం రాత్రి దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారి పి.రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా తిరుగుతున్న పాండిచ్చేరి రిజిస్ట్రేషన్ ఉన్న బస్సులో అత్యవసరద్వారం ముందు బెర్త్ సీట్లు ఉంటడంతో సీజ్‌చేసి పామూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పామూరు నుంచి తిరుగుతున్న అన్ని ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ప్రతి బస్సులో అత్యవసర ద్వారం వద్ద ఎలాంటి సీట్లు ఉండరాదన్నారు. అగ్నిమాపక సిలిండర్ల పనితీరును పరిశీలించారు. వాహన పత్రాలు సక్రమంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ సుధారాణి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలతో అనేక ప్రాంతాల్లో రోడ్లు, పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. అధికారులు పంటల నష్టాన్ని సమగ్రంగా ప్రభుత్వానికి అందించి రైతులకు సహాయం అందేవిధంగా చూడాలని కోరారు. దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు లు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో పి.కల్పన, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఆవుల సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ ప్రపంచకప్ గెలవడం ఆనందదాయకం

దర్శి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రపంచ క్రికెట్ టోర్నమెంట్‌లో భారతదేశం ఘనవిజయం సాధించి కప్‌ను కైవసం చేసుకోవటం ఆనందదాయకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సుమారు 40 సంవత్సరాలుగా మహిళా క్రీడాకా రుల పోరాటం నేటికి ఫలించిందన్నారు. పోరాట స్ఫూర్తితో ముందుకు సాగితే లక్ష్యాన్ని సాధించవచ్చనే విషయాన్ని భారత మహిళా క్రికెట్ జట్టు నిరూపించిందని ప్రశంసించారు. జట్టు సభ్యులందరూ సమిష్టిగా రాణించి దేశానికి ఘనవిజయం అందించారని ఆమె కొనియాడారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చందలూరు విద్యార్థి

దర్శి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సలోమాన్ ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సలోమాన్ విశేష ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగం పోటీలకు ఎంపిక కావటం పట్ల ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజనేయులు అభినందనలు తెలిపారు. కొద్దిరోజుల క్రితం చందలూరు హైస్కూల్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ కూడా హ్యాండ్‌బాల్ అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే.

విద్యార్థులతో మాక్ అసెంబ్లీ

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం అరివేముల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఒంగోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అసెంబ్లీ నిర్వహణ, స్పీకర్ పాత్ర, అధికార పార్టీ విధులు, ప్రతిపక్షం బాధ్యతలు, ప్రభుత్వ హామీలు, తదితర అంశాల పట్ల మాక్ అసెంబ్లీతో విద్యార్థులు అవగాహన పొందుతారన్నారు. ఈకార్యక్రమాన్ని సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుడు ఇండ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, షేక్ ఖాదర్‌ఉన్నీసా బేగం, ఉప్పలపాడు, ఏకనాంపురం హెచ్‌ఎంలు షేక్ నాయబ్‌రసూల్, నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వగ్గంపల్లి విద్యార్థిని ఎంపిక


మహాలక్ష్మితో ఉపాధ్యాయులు

పామూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగ్గంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వతరగతి చదువుతున్న ఎస్.మహాలక్ష్మి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం వెంకట నరసరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.నరసింహారావు, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. స్కూల్‌గేమ్ ఫెడరేషన్ మండలస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభచాటిన ఆమె ఒంగోలులో ఆదివారం జరిగిన సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మహాలక్ష్మిని ఉపాధ్యాయులు అభినందించారు. కర్నూల్‌లో 7,8,9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లోనూ రాణించాలన్నారు.

రాములవారి గుడికి భూవిరాళం


రాములవాడిగుడి నిర్మాణానికి స్థలపత్రం అందజేస్తున్న శేషయ్య

తాళ్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలో రాములవారిగుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన కొర్రపాటి శేషయ్య ఉచితంగా పది సెంట్ల స్థలాన్ని ఇచ్చారు. గ్రామంలో పురాతన రాములవారిగుడి శిథిలావస్థకు చేరడంతో నూతన గుడి నిర్మించేందుకు గ్రామస్థులు ముందుకు వచ్చారు. పురాతన గుడిఉన్న స్థలం చిన్నదిగా ఉంది. దీంతో గుడి పక్కనే శేషయ్యకు చెందిన స్థలం ఉండటంతో గుడి నిర్మాణానికి ఇవ్వాలని రాష్ట్ర నాటకఅకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవిరామయ్య, చిరంజీవి, కామయ్య, వేణుబాబు కోరారు. దీంతో పదిసెంట్ల స్థలాన్ని గుడికి రాసిచ్చి సంబంధిత పత్రాన్ని పెద్దలకు అందజేశారు. గ్రామం నడిబొడ్డున ఉన్న ఆస్థలం విలువ రూ.12 లక్షలు ఉంటుందని వారు తెలిపారు.

పోలీసు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు ద్వారా వేలిముద్రలతో నగదు ఇచ్చే వారు ప్రభుత్వ, పోలీసుల నిబంధలను పాటించాలని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి కనిగిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆధార్, మీసేవ, నెట్ సెంటర్లలో నగదు ఇచ్చే వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిరక్షరాస్యులను పలువరు మోసం చేస్తున్నారని అన్నారు. వారికి కావాల్సిన నగదు కంటే ఎక్కువ నగదు తీస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా మోసాలకు పాల్పడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వేలిముద్రల ఆధారంగా నగదు ఇచ్చే సెంటర్ల నిర్వాహకుల పూర్తి ఆధారాలు, వివరాలు పోలీసులకు ఇవ్వాలని ఆదేశించారు.

కార్యక్రమంలో సీఐలు షేక్ ఖాజావలి, మాకినేని శ్రీనివాసరావు, ఎస్‌ఐలు టి.శ్రీరాం, మాధవరావు, సిబ్బంది, నెట్ సెంటర్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక సోమవారం

దొనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో కార్తీక సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.





గుంటూరు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తిక దీపాల వెలుగుల్లో శైవక్షేత్రాలు

భక్తిశ్రద్ధలతో.. దీపారాధన



అమరావతి: క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



పెదకాకాని: శివాలయంలో దీపారాధనలు చేస్తున్న భక్తులు



గుంటూరు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అమరావతి/పెదకాకాని, గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం రెండవ సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసాయి. మహిళలు, మాలధారులు తెల్లవారు జామునే ఆలయాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాల్లో ప్రదక్షిణలు చేసి.. స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో మహిళలు దీపారాధనలు చేశారు. బాలచాముండికా సమేత అమరేశ్వరాలయానికి.. పంచరామక్షేత్రాల సందర్శన భక్తులు ఆదివారం రాత్రే చేరుకున్నారు. తెల్లవారు జామున పవిత్ర స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం 4 గంట ల నుంచే భక్తులు క్యూలైన్‌లలో బారులు తీరారు.

పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ

పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజామున నుంచే భక్తులు యజ్ఞాల బావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీక మాస దీపారాధనలు చేశారు. మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ఉప కమిషనరు లీలాకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవా రుసుములు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.7 లక్షల ఆదాయం వచ్చినట్లు లీలాకుమార్ తెలిపారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ జాయింట్ ఐజీ కొడాలి పుష్పలత స్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహన పూజలు నిలుపు దల చేసినట్లు తెలిపారు. పౌర్ణమి పర్వదినం కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వ హించను న్నట్లు వెల్లడించారు.

కోటప్పకొండలో భక్తుల కోలాహలం



ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ చేశారు. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది.



అమరావతి: కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు



పెదకాకాని శివాలయంలో భక్తుల రద్దీ



సీసీఐ ఇంకాస్త మెత్తబడాలి

- 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు
- తుఫాన్ వేళ..ఎలా సాధ్యమంటూ రైతుల ఆందోళన
- తేమ శాతం పెంచాలంటూ విజ్ఞప్తి
- కేంద్రం కల్పించిన వెసులు బాటు ప్రస్తావన

మొంథా తుఫాన్ వల్ల పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయిన పత్తి రైతులతో సీసీఐ (కాటన్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా) ఆడుకుం టోంది. 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామని పట్టుబడు తోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ ఆరంభించిన కొనుగోలు కేంద్రాల్లో భారీగా గొడ వలు జరుగుతున్నాయి. వాతావరణం అంతా తేమతో ఉంటే పత్తి పొడిగా ఎలా ఉంటుంది..? అంటూ రైతులు బయ్యర్లతో వాగ్వివాదానికి దిగు తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రా ల్లో వాతావరణ పరిస్థితిని బట్టి ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్‌ఏ క్యూ) నిబంధనలు మార్చుకోవచ్చు అన్న కేంద్ర క్యాబినెట్ ఉత్తర్వులపై చర్చ ఆరంభమైంది. 2014 మేలో కేంద్రం విడుదల చేసిన మద్దతు ధర పథకం (ప్రైస్ సపోర్టు స్కీం, పీఎస్ ఎస్) గైడ్ లెన్స్‌ను కొందరు ప్రస్తావిస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్దతు ధర పథకం గైడ్ లెన్స్ చాప్టర్-2 తుఫాన్‌లు తరచుగా సంభవించే ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు మేలు చేసే అంశాలను ప్రస్తావించింది. ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్‌ఏక్యూ) నిబంధనలను అసాధారణ పరిస్థితిలో కేంద్ర వ్యవసాయ శాఖ అనుమతి తో మార్చుకునే అవకాశం ఉంది. అది కూడా అసాధారణ పరిస్థితి ఏర్పడిన ప్రాంతం వరకు ఈ మినహాయింపు ఇచ్చే అధికారం కేంద్ర వ్యవసాయ శాఖకు ఉంటుంది. ఈ లెక్కన సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాను తాకిడి ఎక్కువగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో ఫెయిర్ యావరేజ్ క్వాలిటీలో మొట్ట మొదటిగా చెప్పబడే తేమ శాతాన్ని పెంచి.. కొనుగోలు చేసే అవకాశం స్పష్టంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు తీసుకువస్తున్న పత్తిలో తేమ శాతం 15 నుంచి 20 వరకు ఉంటుందని (మిగతా 8వ పేజీలో)

ఇదేమి చోద్యం!

- శిక్షణలో ఉద్యోగోన్నతి పొందిన ఎంపీడీఓలు
- వారి డిజిటల్ సిగ్నేచర్‌తో 'ఉపాధి' బిల్లులు అప్‌లోడ్
- నిబంధనలకు విరుద్ధమైనా.. పట్టించుకునేవారేరీ?
- ఏడు మండలాల్లో.. రూ.8.66 కోట్లు..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం బిల్లుల ప్రక్రియలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. మెటీరియల్ బిల్లుల అంశంలో కొందరు అధికారులు నిబంధనలను తుంగ లో తొక్కారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో బిల్లులను అప్‌లోడ్ చేయడంలో శిక్షణలో ఉన్న మండల ప్రజా పరిషత్ అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఏడు మండలాల్లో రూ.8.66 కోట్ల విలువైన బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది.

శిక్షణలో ఉండగానే... బిల్లులు అప్‌లోడ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన 16 మంది విధుల నిర్వహణపై బాపట్లలోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సదరు అధికారుల స్థానంలో పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల నుంచి ఇన్‌చార్జిల (ఎఫ్‌ఏసీ)ను నియమించారు. ఎంపీడీవోలు పని చేస్తున్న చోట నుంచి రిలీవ్ అయి శిక్షణకు హాజరయ్యారు. వీరు శిక్షణలో ఉండగానే అయా మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి మెటీరియల్ బిల్లులను అప్‌లోడ్ చేశారు. డీఎస్(డిజిల్ సిగ్నేచర్) వారి వద్ద ఉన్నా దానిని శిక్షణ కాలంలో వినియోగించరాదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. నిబంధనలకు



సీసీ రోడ్డు నిర్మాణం (పాత చిత్రం)

విరుద్ధంగా కొందరు డీఎస్‌లను వినియోగించి బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఉపాధి పనుల్లో బిల్లుల అక్రమాలపై మండలాల వారీగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరు గుతోంది. బిల్లుల ప్రక్రియలో నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలన్న వాదన వినిపిస్తోంది. ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న డ్వామా ఉన్నతాధికారులు శిక్షణ కాలంలో ఏ మండలంలో ఎంత మేర బిల్లులు ప్రక్రియ పూర్తి చేశారన్న అంశంపై దృష్టి సారిస్తే జరిగిన అవకత వకలు వెలుగుచూసే అవకాశం ఉంది.



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఉమామహేశ్వర్

నిర్దిష్ట గడువులోగా అర్జీలకు పరిష్కారం

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ఎస్పీకి సమస్యలు విన్నవించుకున్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మహిళలు, వృద్ధుల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలపై నివేదికను పోలీసు కార్యాలయానికి పంపాలన్నారు. భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు వంటి పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 83 మంది అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్‌ఎస్‌సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభం కాకముందే పగుళ్లు

ప్రశ్నార్థకంగా మారిన జాతీయ రహదారి నాణ్యత

కారంచేడు - పర్చూరు మధ్య రోడ్డు ఇలా



పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి (167ఏ) నాణ్యత ప్రశ్నార్థకమైంది. పనులు పూర్తి కాకుండానే పగుళ్లిస్తోంది. పర్చూరు - కారంచేడు మధ్య వాగు అంచున రోడ్డు కుంగిపోయింది. ఈ పగుళ్ల కప్పిపుచ్చేందుకు గుత్తేదారు క్రషర్ డస్టు వేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దాదాపు రూ.850 కోట్లతో నిర్మిస్తున్న రహదారి కనీసం ప్రారంభోత్సవం జరగక ముందే పగుళ్లు ఇవ్వడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో పర్చూరు పర్యటనకొచ్చిన రాష్ట్ర మంత్రులు సైతం రోడ్డు నాణ్యతపై పెదవివిరిచారు. పర్చూరు - కారంచేడు సమీపం వరకు వాగు అంచున రివిట్‌మెంట్ చేయకపోవడం వల్లే రోడ్డు పగుళ్లిచ్చి ఉంటుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. సర్వీసు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల తిమ్మరాజుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఇందుకు నిదర్శనం. రోడ్డుకు అంచుల్లో ఎక్కడా డ్రెయినేజ్‌ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో పొలాలు వరద ముంపునకు గురికావడమే కాకుండా.. రహదారి నిర్మాణం దెబ్బతింది. పటిష్టమైన రివిట్‌తో కూడిన డ్రెయిన్ ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా సూచనలు చేశారు.



పగుళ్ళ ప్రాంతంలో డస్టుతో సరిపెట్టిన వైనం



ఘటనా స్థలంలో కంటైనర్, కారు



శ్రీనివాసరాజు బేతాళం లక్ష్మీ బలరామరాజు పుష్పవతి

నిశీధిలో మృత్యుఘోష

- నలుగురు మృత్యువాత.. అందరూ బంధువులే
- గాయాలతో బయటపడిన ఇద్దరు చిన్నారులు
- ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా కర్లపాలెం వద్ద దుర్ఘటన

లారీని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన కారు

కర్లపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాపట్లలోని బంధువుల శుభకార్యానికి వెళ్లిన కుటుంబం తిరుగు ప్రయాణం తిరిగిరాని లోకాలకు సాగింది. నిశీధిలో ఎదురుగా కంటైనర్ రూపంలో వచ్చిన మృత్యువు నలుగురిని కబళించింది. ఈ దుర్ఘటనలో కారులో నలుగురు పెద్దలు మృతి చెందగా.. ఇద్దరు చిన్నారులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పంచాయతీలోని సత్యవతిపేట జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాద స్థలం వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కర్లపాలెంలోని సినిమా హాలు వెనుక బజారులో నివాసం ఉంటున్న బేతాళం బలరామరాజు, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల శుభకార్యానికి బాపట్ల వెళ్లారు. ఫంక్షన్‌లో ఆనందంగా గడిపి ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి మూడు కార్లల్లో తిరుగు ప్రయాణమయ్యారు. బలరామరాజు, లక్ష్మీ ప్రయాణిస్తున్న కారులో వారి చిన్న కుమార్తె (మిగతా 8వ పేజీలో)

నలుగురూ బంధువులే..

బేతాళం బలరామరాజు, లక్ష్మీలది వ్యవసాయ కుటుంబం. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె వాణి, భర్త వేణు, మనవరాళ్లు భావన, దీపికలు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. చిన్నకుమార్తె గాదెరాజు మాధవి, భర్త అనీల్‌కుమార్ వర్మ పైలెట్‌గా ఉద్యోగం చేస్తూ ఉదయపూర్‌లో ఉంటున్నారు. గాదెరాజు పుష్పవతి బలరామరాజుకు వియ్యపురాలు. చిన్నకుమార్తెను పుష్పవతి కుమారుడికి ఇచ్చి వివాహం చేశారు. ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు పుష్పవతి కోడలు మాధవి, మనవడు జయంత్, మనవరాలు వైష్ణవిలను తీసుకొని గన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి ముదునూరి శ్రీనివాసరాజు కారులో నేరుగా బాపట్లకు వెళ్లారు. విజయవాడకు చెందిన శ్రీనివాసరాజుకు ఒక్కడే కుమారుడు. అతనికి ఈ నెల 26న వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి, అంత్యక్రియలను దగ్గరుండి చూసుకున్నారు.

శింగర కొండకు.. సొబగులు

- ఆలయ రాజగోపురాలు, ప్రాకార మండపం నిర్మాణానికి సన్నాహాలు
- శృంగేరి పీఠాధిపతిని కలిసిన అధికారులు, పూజారులు

అద్దంకి,నవంబరు3(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాజగోపురాలు, ప్రాకార మండపం నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. సుమారు 20 కోట్ల రూపాయల అంచనాతో, నాలుగు రాజగోపురాలు, ప్రాకార మండపం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతిస్వామిని సోమవారం హైదరాబాద్ లోని ఆశ్రమంలో ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, వేదపండితులు హరిశంకరావధాని, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ, శ్రీరామచం ద్రమూర్తి కలిసి వివరించారు. నెల రోజులలో పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. గోశాల నిర్మాణం విషయం కూడా విధుశేఖర భారతీస్వామికి వివరించారు. దాతలు కూడా సిద్ధంగా ఉండటం, మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటంతో, పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేసేందుకు అధికారులు, ధర్మకర్తల మండలి సన్నద్ధమవుతున్నారు.



శింగర కొండ ఆలయం

ఖరీఫ్ కష్టం.. రబీ జాప్యం

- వ్యవసాయంపై తీవ్ర ప్రభావం
- చూపిన మొంథా తుఫాన్
- కీలక సమయంలో దెబ్బతీసిన భారీవర్షాలు

మొంథా తుఫాన్ జిల్లాలో వ్యవసాయ రంగంపై తీవ్రప్రభావం చూపింది. కీలక సమయంలో తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను దెబ్బతీయడమే కాక రబీ పంటల సాగుకు ఆలస్యం కానుంది.



ఉప్పుగుండూరు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు (ఫైల్)

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వ్యవసాయంపై తీవ్రంగా ఉంది. ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతినగా, రబీ సాగు బాగా ఆలస్యం కానుంది. జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ సీజన్‌గా అక్టోబరు నుంచి రబీ సీజన్‌గా పరిణిస్తారు. జిల్లాలో అక్టోబరు తొలిపక్షంలో వేసే పంటలను కూడా ఖరీఫ్ సీజన్‌గానే లెక్కిస్తున్నారు ఖరీఫ్‌లో జిల్లాలో వ్యవ సాయ శాఖ పరిధిలో లక్షా 29వేల హెక్టార్లలో వివిధ పంటల సాగు చేస్తారు. అలాగే ఉద్యాన శాఖ పరిధిలో మరో 20వేల హెక్టార్లలో మిర్చి, కూరగాయలు ఇతరత్రా సాగు చేస్తారు. ఈ ఏడాది దాదాపు లక్షా 24వేల హెక్టార్లలో వ్యవ సాయశాఖ పరిధిలోని పంటలు, 15వేల హెక్టార్లలో ఉద్యానశాఖ పరిధిలో పంటలు వేశారు. ప్రధానంగా కంది, పత్తి, వరి, సజ్జ, మొక్కజొన్న, బర్లీ పొగాకు, మిర్చి తదితరాలు సాగు చేశారు. ఆ పంటలు పూత, పిందె, కోత దశలకు అధికభాగం చేరగా కొంత విస్తీర్ణంలో ఎదుగుదల దశలో ఉన్నాయి.

అక్టోబరు నెల కీలకం

అక్టోబరు నెల ఖరీఫ్ పంటలకు కీలక సమయం. మరోవైపు రబీ పంటలు అత్యధిక భాగం అక్టోబరు, నవంబరు నెలల్లో వేస్తారు. పశ్చిమ ప్రాంతంలో పొగాకు, శనగ అధికభాగం అక్టోబరులోనే సాగు చేస్తారు. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో నవంబరు, డిసెంబరులలో వాటి సాగు చేపడతారు. అక్టోబరు, నవంబరుల్లో అన్ని ప్రాంతాల్లోనూ వరినాట్లు వేస్తారు. అలా అక్టోబరు రబీ పంటల సాగుకు కీలకం. ఇలాంటి సమయంలో ఒక్కసారిగా తుఫాన్ విరుచుకుపడి జిల్లాను ముంచెత్తింది. కేవలం 36 గంటల వ్యవధిలో జిల్లాలో 18.40 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

నష్ట అంచనాల్లో అధికారులు

జిల్లాలో అక్టోబరులో సాధారణ వర్షపాతం 20.57 సెం.మీ కాగా ఏకంగా 49.96 సెం.మీ కురిసింది. పొన్నలూరు మండలంలో 25.02 సెం.మీ సాధారణ వర్షపాతం అయితే అక్కడ దాదాపు 70 సెం.మీ నమోదైంది. సంతనూతలపాడు, పీసీపల్లి పామూరు, ఒంగోలు, మద్దిపూడి, కొత్తపట్నం, కొండపి, కనిగిరి, చీమకుర్తి, సీఎస్.పురం, మద్దిపాడు, ఎన్‌జీపాడు, పొదిలి, సింగరాయకొండ, టంగుటూరు తదితర మండలాల్లో 40 నుంచి 65సెం.మీ వరకు కురిసింది. మిగతా మండలాల్లోనూ 30 నుంచి 40సెం.మీ పడింది. ఇలా సాధారణం కన్నా పలుచోట్ల అధికంగా ఈ నెలలో కురవడం, అందులోనూ తుఫాన్ సమయంలో భారీవర్షాలు ముంచెత్తడంతో పొలంలో ఉన్న ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతిన్నాయి. దాదాపు 40 వేల హెక్టార్లలో పత్తి, మిర్చి, సజ్జ, కంది, వరి, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. ఇంచుమించు 15వేల హెక్టార్లలో ఆ పంటలకు పూర్తిగా నష్టం జరిగినట్లు అధికార వర్గాలు అంచనా వేసి రైతువారీ నష్టాలపై ఎన్యుమ రేషన్ చేస్తున్నారు.

బురదమయంగా భూములు

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలు చేతికొచ్చే అవకాశం లేదు. నీటిలో రెండు మూడు రోజులు ఉన్న ఇతర విస్తీర్ణంలోని పంటలు కోలుకుంటున్నప్పటికీ ఆ పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గి రైతులు భారీగా నష్టపోనున్నారు. మరోవైపు తుఫాన్ వల్ల కురిసిన భారీవర్షాల ప్రభావం రబీ సాగుపైనా తీవ్రంగా చూపనుంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో శనగ, పొగాకు, మిర్చి వంటి పంటలను అక్టోబరులో ముమ్మరంగా వేస్తారు. అలాగే తూర్పు ప్రాంతం లో కాస్తంత ఆలస్యంగా వేసే ఆ పంటలకు భూములు సిద్ధం చేసే పని ఆ సమయంలో జోరుగా సాగుతుంది. అయితే అక్టోబరు 20 నుంచి వర్షాలు ప్రారంభమై తుఫాన్ సమయంలో ముంచెత్తడంతో పొలాల్లో భారీగా వర్షపు నీరు పారి బురదమయంగా మారాయి. అవి పూర్తిగా ఆరి సేద్యం చేస్తే తప్ప పంటలు వేసే అవకాశం లేదు.





భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవార పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచే స్థానిక శివాలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి కార్తీకదీపాలను వెలిగించి, పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం అక్కడి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, సంతపేట సాయిబాబా మందిరంలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన మొదలైన కార్యక్రమాలు జరిగాయి. సోమవారం సాయంత్రం సైతం మహిళలు కార్తీక దీపారాధనలలో పాల్గొన్నారు.

బండ్లమూడిలో రణరంగం

చీమకుర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన వివాదం చినికిచినికి గాలివానలా మారి దాడులకు దారితీసింది. కానిస్టేబుల్ వారిస్తున్నా సరే ఎస్సీలపై మరోవర్గం కర్రలతో దాడి చేసింది. ఈ ఘటన సోమవారం మండలంలోని బండ్లమూడి గ్రామ నడిబొడ్డున చోటుచేసుకుంది. సీఐ దాసరి ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్.సుబ్బారెడ్డికి చెందిన గొర్రెలు ఇదే గ్రామ ఎస్సీకాలనీకి చెందిన కంట్లం ఏసుదాసు, ఎలీసమ్మ, రామయ్యలకు చెందిన సరుగుడు పొలంలో పడటంతో పంట నష్టం జరిగింది. ఈ విషయమై నిలదీయడానికి పొలం యజమానులైన ఎస్సీలు సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ వాగ్వాదం చోటుచేసుకోవడంతో నష్ట పరిహారం చెల్లిస్తామని సుబ్బారెడ్డి ఒప్పుకున్నాడు. దానికి అంగీకరించని పొలం యజమానులు చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గ్రామానికి వచ్చి బస్టాండ్ సెంటర్‌లో విచారణ ప్రారంభించారు. అదేసమయంలో పొలం యజమానులు, మరికొంత మంది తమ బంధువులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీలు సామాజికవర్గం మొత్తాన్ని కలిపి మాట్లాడుతున్నారంటూ కొందరు అడ్డుకున్నారు. 'మా ఇళ్ల మీదకే వచ్చి దౌర్జన్యం చేస్తారా..' అంటూ అక్కడే ఉన్న కొంతమంది కర్రలతో ఎస్సీలపై ఒక్కసారిగా దాడికి దిగారు. మధ్యలో హెడ్ కానిస్టేబుల్ సర్ది చెబుతున్నా వినిపించుకోలేదు. దీంతో బండ్లమూడి బస్టాండ్ సెంటర్ రణరంగంగా మారింది. ఈ ఘటనలో ఎస్సీలు కంట్లం రామయ్య, ఏసుదాసు, ఏసేపు, మరో మహిళకు గాయాలయ్యాయి. వారిని బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



బండ్లమూడిలో దాడి చేస్తున్న వారిని వారిస్తున్న కానిస్టేబుల్

ఇదే ఘటనలో గోపి రెడ్డి బాలఓబుల్ రెడ్డి, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరూ వైద్యంనిమిత్తం ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై కంట్ల ఏసుదాసు ఫిర్యాదు మేరకు వనిపెంట శ్రీనివాసరెడ్డి, బాలఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అదే విధంగా ఓబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురు ఎస్సీలపై కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాద్ కేసు విచారిస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

చెంచు గిరిజనులను ఆదుకోండి

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన చెంచు గిరిజనులను ఆదుకోవాలని రాష్ట్ర చెంచు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ నాయకుడు అంకారావు కోరారు. ఈ మేరకు శ్రీశైలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రాజెక్ట్ అధికారి వెంకటశివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మొంథా తుఫాన్‌తో గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాలోని పలు గిరిజన గూడేలలో ఇళ్లు దెబ్బతిన్నాయని, కొందరికి పంట నష్టం జరిగిందని వాటిపై విచారణ జరిపించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

నిశీధిలో మృత్యుఘోష

(5వ పేజీ తరువాయి)

అత్తయ్య, వియ్యపురాలు గాదె రాజు పుష్పవతి(60), మనవడు జయంత్, మనవరాలు వైష్ణవి, బంధువు ముదునూరి శ్రీనివాసరాజు (57) ఉన్నారు. శ్రీనివాసరాజు కారు డ్రైవింగ్ చేస్తున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో కర్లపాలెం పంచాయతీ సత్యవతిపేట వద్దకు వచ్చేసరికి లారీని తప్పించబోయి వారి కారు ఎదురుగా వస్తున్న రొయ్యల కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బలరామరాజు, లక్ష్మీ, పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసరాజు కొన ఊపిరితో హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందారు. చిన్నారి వైష్ణవికి కుడి భుజానికి గాయాలు కాగా చీరాలలోని ప్రైవేట్ వైద్యశాలకు, జయంత్ తల, కాళ్లకు గాయాలు కాగా గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన మూడు నిమిషాల్లోనే మిగిలిన రెండు కార్లు ఘటనా స్థలానికి చేరుకోవడంతో.. బంధువులు బోరున విలపిస్తూ మృతదేహాలను వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై సీఐ హరికృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సీసీఐ ఇంకాస్త 'మెత్తబడాలి'!

(5వ పేజీ తరువాయి)

సీసీఐ బయ్యర్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల రైతులు పత్తిని ఎంత ఆరబెట్టినా అదే తేమ శాతం నమోదు కావడం గమనించదగిన అంశం. ఈ పరిస్థితుల్లో తేమ శాతాన్ని 12 నుంచి 20కి పెంచాలని రైతులు కోరుతున్నారు. ఈ మాత్రం వెసులుబాటు ఇవ్వకపోతే తాము పూర్తిగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పని చేయని కిసాన్ యాప్

సీసీఐ అందుబాటులోకి తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ సరిగా పనిచేయక పోవడం రైతులకు శాపంగా మారింది. స్లాట్ బుక్ చేసుకోవడం గగనం అయిపోతుందని రైతులు చెబుతున్నారు. సీసీఐ అధికారులు మాత్రం అదే యాప్ ను వాడాలని చెబుతున్నారు.

జీఓ నంబరు 843కి తిలోదకాలు

రాష్ట్రంలోని పత్తి రైతులకు మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 843కి సీసీఐ తిలోదకాలు ఇచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ జీవోలని 23వ నిబంధన ప్రకారం రైతు పత్తిని ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు ఉంది. సీసీఐ మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. ఏ జిల్లా రైతులు అదే జిల్లాలో, ఏ మండలం రైతులు అదే మండలంలో పత్తిని విక్రాయించాలని సూచిస్తోంది. జీఓను కూడా గుంటూరు లోని సీసీఐ జనరల్ మేనేజర్ పక్కన పెట్టడం దుమారం రేపుతోంది.

ఆర్టీసీ కార్గో డెలివరీ కౌంటర్ ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్గో పార్శిల్ విభాగం డెలివరీ కౌంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఆర్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో సీనియర్ ముఠామేస్త్రి జె.తిరుపతయ్య దీనిని ప్రారంభించారు. పార్శిల్ డెలివరీ కోసం వచ్చే కస్టమర్లు ఇక నుంచి ప్రకాశం హాస్పిటల్ రోడ్ ద్వారా డెలివరీ కౌంటర్లకు చేరుకుని వారి పార్శిల్‌ను, ఎల్ఆర్ నెంబరు డెలివరీ కోడ్ తెలపడం ద్వారా కౌంటర్ల నుంచి పొందవచ్చని తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలే ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్ల ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి

అవీ..ఇవీ..

7నుంచి చెస్, 23 నుంచి యోగా పోటీలు

పంగులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు చెస్, 23 నుండి 25 వరకు యోగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్. జిల్లా కార్యదర్శి కె.ప్రతిమ తెలిపారు. ఎస్‌జీఎఫ్ 69వ జిల్లాస్థాయి చెస్, యోగా పోటీలు ఒంగోలులో ముగిశాయన్నారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలు మన్యం జిల్లా జోగంపేటలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలు 23 నుంచి 25 వరకు బాపట్ల జిల్లా, జే.పంగులూరు మండలం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని కార్యదర్శి ప్రతిమ, పీడీ మధుమూర్తి తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

పంగులూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమూరు గ్రామ పొలాలలో మొంథా తుఫాన్‌కు కుప్పకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సిబ్బంది సోమవారం పునర్నిర్మించారు. తీవ్ర తుఫాన్ కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవడంతో వ్యవసాయ పంప్‌సెట్లకు సరఫరా నిలిచింది. సమస్యను గుర్తించిన విద్యుత్ ఏఈ ఆంజనేయులు తన సిబ్బందితో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ పునర్నిర్మాణం చేపట్టారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించిన సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జన జాతీయ జాగారణ దివస్


జాగరణ దివస్ వేడుకల్లో ఉపాధ్యాయులు

వాడరేవు (చీరాల), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జనజాతీయ జాగారణ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధులు, జానపద గాయకులు బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రత్న కుమారి ఆధ్వర్యంలో గిరిజన గోడ చిత్రకళ, వార్లీ గోండ్ చిత్రాలు తయారీ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మార్టూరులో జ్వాలా తోరణం

మార్టూరు,నవంబరు3(ఆంధ్రజ్యోతి):కార్తీక పౌర్ణమి సందర్భంగా జాతీయ రహదారి పక్కన ఉన్న మార్టూరులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు ఎన్ మృత్యుంజయశాస్త్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం అనంతరం మాలధారులకు భిక్ష, భక్తులకు అన్నదానం చేయనున్నారని తెలిపారు. కార్యక్రమానికి అయ్యప్ప స్వామి మాలధారులు, భవాని స్వాములు శివస్వాములు తదితర భక్తులు హాజరై, స్వామి వారి కార్యక్రమాన్ని తిలకించాలని ఆయన కోరారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

పంగులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ఈ నెల 26న పాల్గొనే అవకాశం పంగులూరు మండల విద్యార్థులకు దక్కింది. రాజ్యాంగదినోత్సవం కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాల పరిధిలో జరిగిన పోటీలలో బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థి యాస్మిన్ ప్రథమస్థానంలో నిలువగా, కొండమంజులూరు విద్యార్థిని జపన్యకు ద్వితీయ స్థానం దక్కింది. 26న జరిగే మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రతిభచాటి అద్దంకి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించే అవకాశం అందిపుచ్చుకున్న యాస్మిన్, జపన్యలను ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు సోమవారం అభినందించారు.

ముగిసిన క్విజ్ పోటీలు

చీరాల : రాజ్యాంగ దినోత్సవ నియోజకవర్గస్థాయి క్విజ్ పోటీలు మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రమాదేవీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ఈ నెల 24న అమరావతిలో నమూనా అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి శిక్షణ ఇస్తారని చెప్పారు. అనంతరం అక్కడ కూడా ప్రతిభ కనబరచిన వారికి ఈ నెల 26 నుంచి నమూనా అసెంబ్లీ పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్


వరిపైరును పరిశీలిస్తున్న కరణం వెంకటేష్

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలో నీట మునిగిన వరి, వేరుశనగ పంట పొలాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భారీ తుఫాన్ కారణంగా రైతన్నల పరిస్థితి దయనీయంగా ఉందని, వెంటనే రైతుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

విశ్వజననీ అవార్డు గ్రహీతకు సన్మానం


పర్చూరులో ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశ్వజననీ అవార్డు గ్రహీత పర్చూరు ఎంఈవో-2 అల్లూరి శివ కోటేశ్వరరావుకు సోమవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. విద్యారంగంలో అందించిన సేవకు గుర్తింపుగా ఆయనకు అవార్డు దక్కడం హర్షణీయం అని ఎంఈవో -2 ఎంవీ.వెంకట్రామయ్య అన్నారు. ఒక సాధారణ ఉపాధ్యాయునిగా ప్రభుత్వ కొలువులో అడుగు పెట్టి రాష్ట్రస్థాయిలో అవార్డు పొందడం విద్యాశాఖకే గర్వకారణం అన్నారు. అనంతరం శివకోటేశ్వరావును దుశ్శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

- ఉదయాన్నే శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్న మహిళలు


అద్దంకిలోని కమతేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చినగంజాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమశివుని మదినిండా కొలిచారు. స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. చినగంజాం గంగాపార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాలను భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రాలు, ఆలయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపారాధనలు చేశారు. ఆలయాలు కార్తీక దీపాల వెలగులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

అద్దంకి : కార్తీక సోమవారం పూజలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాల గుడి, కమతేశ్వరాలయం తదితర శివాలయాలలో కార్తీక సోమవారం సందర్భంగా మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. మణికేశ్వరంలోని మల్లేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించు కున్నారు. వరదల నేపథ్యంలో గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేయకుండా మణికేశ్వరం వద్ద స్నానాల ఘాట్‌ను దేవాలయం ఈవో గుంటుపల్లి వాసుబాబు మూసివేయించారు. ఏర్పాట్లను సీఐ సుబ్బరాజు పరిశీలించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తీక సోమవార పూజలు

పర్చూరు : కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. వేకువ జామునుండే పెద్దఎత్తున భక్తులు చేరుకొని ఆలయాల్లో కార్తీకదీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు, ఉప్పుటూరు శివాలయం, చెరుకూరు, తదితర ఆలయాల్లో విశిష్ఠ పూజా కార్యక్రమాలు దీపోత్సవం చేపట్టారు. కార్తీక సోములు చేసుకునే భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, వ్రతకార్యక్రమం చేపట్టారు.

మార్టూరు : శివాలయాల్లో భక్తులు సందడిగా కనిపించారు. ముఖ్యంగా మహిళలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మార్టూరులో నేతాజీనగర్ సమీపంలోని ఘట్టేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం సమీపంలో ఏర్పాటుచేసిన ఘట్టేశ్వరస్వామికి భక్తులు అభిషేకం చేసి, అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. జాతీయరహదారి పక్కన ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరుడ్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అదేవిధంగా అయ్యప్ప, భవాని మాలధారులు, ఇంకా వివిధ మాలధారులు కూడా వేకువజాము నుంచి దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడంతో,దేవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి వాతావరణం ఏర్పడింది.





చినగంజాంలోని రామకోటేశ్వరస్వామి, పర్చూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, మార్టూరులోని ఘట్టేశ్వరస్వామి, మణికేశ్వరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ

రబీ పంటలను సాగు చేయగానే నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

యద్దనపూడి, (మార్టూరు)నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రబీలో పంట సాగు చేయగానే పంటల నమోదు చేయించుకోవాలని ఏవో కుమారి అన్నారు. సోమవారం యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల్లో 33 శాతంకన్న ఎక్కువగానే నష్టపోవడంతో, ప్రభుత్వానికి నివేదికను పంపించామన్నారు. మండలంలో డ్వాక్రా గ్రూపులను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలకు, చేరువయ్యే దిశగా 134 రైతు ఉత్పత్తిదారులసంఘాలను ఏర్పాటుచేశామని వెలుగు ఏపీఎం వెంకటరావు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెల రోజుల వ్యవధిలో 2 నార్మల్ డెలివరీ లను చేశామని, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యాధికారి హర్ష సమావేశంలో చెప్పారు. మండలంలో 8 గ్రామాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య తెలిపారు. మండలంలో బాల్యవివాహాలు జరగకుండా ఉండేందుకు అందరూ సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర ప్రజా ప్రతినిదులను, అధికారులను కోరారు అంతేగాకుండా సంతానం లేని దంపతులు పిల్లలను దత్తత తీసుకోవడానికి బాపట్ల కేంద్రంలో సంప్రదించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా ఇంటిపన్నులను చెల్లించాలన్నారు. గ్రామస్థులు ఎక్కడ నుంచైనా, ఇంటి పన్నును చెల్లించే అవకాశం ఉందని ఈవోఆర్ డీ కృష్ణ అన్నారు. పశుపోషకులకు 75 శాతం రాయతీతో జొన్న విత్తనాలను పంపిణీచేస్తామన్నారు. ఒక్కొక్కరికి 5 కిలోలు జొన్నవిత్తనాలను అందచేస్తామని పూనూరు పశువైద్యాధికారి తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో షేక్ మహమ్మద్ అఖీబ్ జావెద్, విద్యుత్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక పారిశుధ్యం వంతు


మురుగు నీటితో అధ్వానంగా ఈపూరుపాలెంలో ఓ వీధి

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వర్షపు నీరు దాదాపుగా తొలగింది. పాలకులు, అధికారులు చాలావరకు తుఫాన్ నీటిని తొలగించే పనిలో కొంత వరకు సఫలీకృతులయ్యారు. అయితే కొన్నిచోట్ల నీరు తొలగించాల్సి ఉంది. ఈక్రమంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని గ్రామాల్లో వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై వీధులు, స్కూల్ గ్రౌండ్‌లు, నివాసాలు అధ్వానంగా మారాయి. ఆయా సమీపాల్లో దుర్వాసనలు, దుర్గంధాలు వెదజల్లుతున్నాయి. దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలు లేని కారణంగా గతంలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఈనేపధ్యంలో దీనికి వర్షపు నీటి మురుగు ఏకం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు. లేకుంటే రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.


ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ మైదానం

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్లు జైలు

మేదరమెట్ల నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):హత్యాయత్నం కేసులు నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, 10000 జరిమానా విధిస్తూ అద్దంకి కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకట నాగలక్ష్మి సోమవారం తీర్పు ఇచ్చారు. కొరిసపాడు ఎస్సై సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిసపాడు మండలం కృష్ణంరాజు వారి పాలెం గ్రామానికి చెందిన మోదుగుల సోమిరెడ్డి అదే గ్రామానికి చెందిన భవనం చిన్నారెడ్డిని 2020 మే నెలలో దాడి చేసి గాయపరిచాడు. చిన్నారెడ్డి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు పంపించారు. ఆ కేసుకు సంబంధించి తుదితీర్పు సోమవారం వచ్చింది. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరల డీఎస్పి మోయిన్ ఆధ్వర్యంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ సురేష్ బాబు, కోర్టు కానిస్టేబుల్ ఆనంద్ కేసు దర్యాప్తు వేగంగా చేసి నిందితుడికి శిక్షపడేలా కృషి చేశారు. అప్పట్లో కేసు నమోదు చేసిన ఎస్ఐ మల్లికార్జునరావు ప్రస్తుతం కంభం సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. సాక్ష్యాలు సేకరించడంతోపాటు, నిందితుడిని డిమాండ్ కు పంపించడంలో కృషిచేసిన మల్లికార్జున ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పొలం వివాదంలో మహిళపై పలువురు దాడి

- మార్టూరు నుంచి కారులో వచ్చి దాడిచేసినట్లు బాధితురాలి ఆవేదన

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పొలం వివాదంలో మహిళపై పలువురు దాడిచేయగా బాధితురాలు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు పర్చూరు మండలం చెరుకూరుకు చెందిన బుర్ల వెంకాయమ్మకు మార్టూరుకు చెందిన ఎలగాల సాయి, నాగలక్ష్మీ, కోటేశ్వరమ్మ, నాగేంద్రమ్మలకు గతకొంత కాలంగా పొలం వివాదం ఉంది. వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉండగా, సోమవారం ప్రత్యర్థులైన నలుగురు కారులో మార్టూరు నుండి ఇంటికి వచ్చి ఒంటరిగా ఉన్న వెంకాయమ్మపై దాడిచేసి గాయపరిచి వెళ్లి పోయారు. బంధువుల సహకారంతో ప్రస్తుతం బాధితురాలు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


విజేతలను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు

అద్దంకి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ పోటీలలో భాగంగా సోమవారం నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వ్యాసరచన పోటీల నుంచి ముగ్గురిని, వక్తృత్వ పోటీల నుండి ముగ్గురిని ఎంపిక చేసి ఆరుగురు కి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమస్థానాన్ని పంగులూరు మండలం బూదవాడ హైస్కూల్ విద్యార్థిని యాస్మిన్, ద్వితీయస్థానాన్ని కొండమంజులూరు హైస్కూల్ విద్యార్థి జపన్య, తృతీయస్థానం బల్లికురవ మండలం పెద అంబడిపూడి హైస్కూల్ విద్యార్థిని గీతికామాధురి సాధించారు. ముగ్గురుని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతున్నారు. కార్యక్రమంలో అద్దంకి, పంగులూరు, బల్లికురవ ఎంఈవోలు కేవీ.శ్రీనివాసరావు, వీరాంజనేయులు, రమేష్, హెచ్‌ఎంలు శ్రీనివాసమూర్తి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, బుచ్చిబాబు, లక్కరాజు సుజాలు పాల్గొన్నారు. విజేతలను అభినందించారు.

గుండ్లకమ్మలో దూకిన వ్యక్తి మృతదేహం గుర్తింపు


నాగబ్రహ్మారావు (ఫైల్)

అద్దంకి/మద్దిపాడు,నవంబరు3(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మాచాబత్తుని వెంకట నాగ బ్రహ్మారావు(61) మృతదేహం మద్దిపాడు మండలం నందిపాడు సమీపంలో లభించింది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన నాగబ్రహ్మారావు కెనరాబ్యాంక్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉండడంతో మతిస్థిమితం కోల్పోయాడు.. గత నెల 30న మెడికల్ షాపుకు అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జిపై నుంచి దూకే సమయంలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మూడు రోజుల పాటు పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గుండ్లకమ్మ నదిలో గాలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నాగబ్రహ్మారావు మృతదేహం గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు దాటి దిగువకు పోయి నందిపాడు సమీపం లో చిల్లచెట్ల మధ్య ఇరుక్కుంది. నందిపాడు గ్రామస్థులు మృతదేహాన్ని గుర్తించి మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసు కున్న అద్దంకి పోలీసులు, బంధువులు నందిపాడు వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి నాగ బ్రహ్మా రావుదిగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు

- కోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత
- సర్వేలో ఆర్‌అండ్‌బీ స్థలంగా గుర్తింపు


కొలతలు వేస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

అద్దంకి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో భవనాసి కాలువ సమీపంలో వైసీపీ నేత గూడా శ్రీనివాసరెడ్డి గోడౌన్ నిర్మించారు. అనధికారిక కట్టడంగా గుర్తించిన మున్సిపల్ అధికారులు యజమాని శ్రీనివాసరెడ్డికి నోటీసులు ఇచ్చారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులపై శ్రీనివాసరెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు సోమవారం మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఓపెన్ సర్వే నిర్వహించారు. సర్వేలో శ్రీనివాసరెడ్డి నిర్మించిన గోడౌన్‌తో పాటు సమీప ప్రాంతంలో సుమారు 80 సెంట్లు ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమించడం, అందులో కొంతమేర నిర్మాణాలు జరిగినట్లు తేలినట్లు మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి లక్ష్మి తెలిపారు. వెనుక వైపు స్థలంలో మున్సిపల్ అనుమతులు తీసుకొని ముందువైపు ఆర్‌అండ్‌బీ స్థలంలో గోడౌన్ నిర్మాణం చేసినట్లు సర్వేలో తేలిందని లక్ష్మీ తెలిపారు. అయితే జిల్లా సర్వేయర్ ద్వారా మరోసారి సర్వే చేయించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

కార్తీక స్నానాలకు అనుమతి నిరాకరణ

వాడరేవు(చీరాల), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రామాపురం, వాడరేవు ప్రాంతాల్లో కార్తీక మాసస్నానాలకు భక్తులకు బుధవారం వరకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. అధికారులు సోమవారం తీరంలో పర్యటించి పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చారు. తుఫాన్ ప్రభావంతో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే భక్తులకు, పర్యాటకులకు అనుమతులు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

కాలువలో పడి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపాలెం భవానీపురానికి చెందిన మీసాల ఉమా(32) మార్కెట్ సమీపంలో కలువపూల విక్రయాలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే దండుబాట రోడ్డు నుంచి స్వర్ణ వెళ్లే మార్గంలోని కాలువలో పూలు కోసేందుకు దిగి ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గౌడ అన్నదాన సత్రానికి నిధులు కేటాయించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అద్దంకి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలో గౌడ సామాజిక అన్నదాన సత్రం భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని గౌడ సంఘం నేతలు సోమవారం గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలను సోమవారం అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంపని రామచంద్రరావు, బలగాని అంజనేయులు, రాఘవ, రామాంజనేయులు, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాత దర్శి రోడ్డులో నివాసం ఉండే 16 నిరుపేద కుటుంబాలకు ముద్దపాటి శ్రీనివాసరావు సహకారంతో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, అశహరి హరిప్రసాద్, చప్పిడి వీరయ్య, పూటుకూరి రామకోటేశ్వరరావు, లేవిప్రసాద్, మహ్మద్‌రఫీ, అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో విద్యుత్ టవర్ల నిర్మాణ పనుల నేపథ్యంలో మంగళవారం రాజీవ్‌కాలనీ, మధురానగర్, బీక్షాలు కాలనీ, ఒంగోలు రోడ్డు తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ దామోదరం తెలిపారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కార్తీక వైభోగం

- భక్తిశ్రద్ధలతో సోమవారపు పూజలు
- ఆలయాలకు తరలివచ్చిన భక్తజనం





నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాల్లో రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరుడికి, శివుడికి అభిషేకాలు, విశేష అలంకారం, ప్రాకారోత్సవాలు కనులపండువగా జరిగాయి. నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల పూజలలో నందీశ్వరుడికి, మూలస్థానేశ్వరుడికి విశేష అభిషేకాలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు. జొన్నవాడ, సంగం, భైరవకోన తదితర ప్రాంతాల్లో భక్తులు పోటెత్తారు.



- రాజరాజేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు భారీ సంఖ్యలో కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోటగురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● స్వర్ణ గరుడుడిపై రంగనాథుడు

కార్తీక మాసం చిలుక ద్వాదశి సందర్భంగా తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం కనుల పండువగా జరిగింది. సాయంత్రం బంగారు గరుడసేవ, పేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్థానిక ఉత్తరాధి మఠంలో తులసీ కల్యాణం వైభవంగా జరిగింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆస్తి రాయించుకుని గెంటేశాడయ్యా!

మనవడి నిర్వాకంపై వృద్ధ దంపతుల ఆవేదన

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వేడుకోలు



నెల్లూరు (హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మానవత్వం మంట కలిసింది. ఎవరినీ నమ్మే పరిస్థితులు ఇప్పుడు లేవు. ఏళ్ల తరబడి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను పట్టించుకొనే వారు కరువవుతున్నారు. కన్నకొడుకు మీద నమ్మకం లేక మనవడి మీద ఆస్తి రాసిన ఆ వృద్ధులకు చివరకు నిరాశే మిగిలింది. కొడవలూరు మండలం యల్లాయపాలెంకు చెందిన దామర్ల శంకరమ్మ, రమణయ్యలు తమ కుమారుడికి బదులుగా మనవడి పేరిట తమ ఆస్తి 98 సెంట్ల భూమిని దస్తావేజులు రాయించి రిజిస్టర్ చేయించారు. ఆస్తి రాయించుకునే వరకు బాగా చూసుకుంటానని నమ్మబలికిన మనవడు అంతా అయ్యాక ఇంటి నుంచి వెళ్లిపోండి అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. ఇంటిలో నుంచి గెంటేశాడు. మనవడు ఇలా చేశాడని కన్నకొడుకుకు విషయం చెప్పబోగా ఆయన ముఖం చాటేశాడు. తమకు జరిగిన అన్యాయం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆ వృద్ధ దంపతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినానికి హాజరై కలెక్టర్ హిమాన్షు శుక్లాకు తమ గోడును వెల్లబోసుకున్నారు. నిలువ నీడ లేదని, ఇక తామెలా జీవించాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులతో విచారించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు.

70 టీఎంసీల చేరువలో సోమశిల

అనంతసాగరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం 70 టీఎంసీల చేరువలో ఉంది. సోమవారం ఎగువ నుంచి 16,918 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, దిగువకు 12,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 69.916 టీఎంసీలు నిల్వ ఉంది.

- **రాపూరు** : మండలంలోని కండలేరు డ్యాంలో 58.78 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 700 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



పోలినేనిచెరువులో తెల్లరాయిని చిన్నసైజుగా మారుస్తున్న కూలీలు

తెల్లరాయి తరలిపోతోంది!

- యథేచ్ఛగా తవ్వేస్తున్న అక్రమార్కులు
- లారీల ద్వారా చెన్నైకి... అక్కడ నుంచి విదేశాలకు..
- అన్నీ తెలిసి మిన్నకుండిపోతున్న యంత్రాంగం

వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలినేనిచెరువు రెవెన్యూ, అటవీ భూముల్లో తెల్లరాయి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో రాయిని వెలికితీసి, టిప్పర్ల ద్వారా పోలినేనిచెరువు రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లోకి చేర్చి ముక్కలుగా మార్చుతున్నారు. ఆ తర్వాత రహస్యంగా పొరుగు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. నిత్యం 50 టన్నులకుపైగా గూడూరుకు అక్కడ నుంచి చెన్నైకు, ఆ తర్వాత విదేశాలకు తరలిపోతోంది. ప్రభుత్వానికి రాయల్టీ ఇతరత్రా రూపాల్లో రావల్సిన ఆదాయానికి అక్రమార్కులు భారీగా గండికొడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు రెవెన్యూ, ఇటు అటవీ శాఖల అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● తెల్లరాయి ఉన్న ప్రాంతాలివే

మండలంలోని పశ్చిమ ప్రాంతంలో పోలినేనిచెరువు, అయ్యవారిపల్లె, మాలకొండ, గరుకుపాలెం, చుండి, వీరన్నపాలెం, పెద్దఅమ్మపాలెం, వలేటివారిపాలెం, అంకభూపాలపురం తదితర గ్రామాల్లోని అటవీ, రెవెన్యూ భూముల్లో తెల్లరాయి దొరుకుతుంది. వలేటివారిపాలెంలో నామమాత్రంగా కొంత ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొని, దాని ఆసరాగా ఇష్టానుసారం తవ్వకాలు జరిపి, రూ.లక్షలు గడిస్తున్నారు.


● తెల్లరాయికి మంచి డిమాండ్

ఈ ప్రాంతంలో దొరికే ఏ గ్రేడ్ తెల్లరాయికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. జపాన్, రష్యా, సింగపూర్, ఇండోనేషియా దేశాలకు ఎగుమతి అవుతుంది. ఈ తెల్లరాయిని పలు రకాల మందుల తయారీకి వినియోగిస్తారు.

● ఐదేళ్లుగా అడ్డగోలుగా..

పోలినేనిచెరువులో ఐదేళ్ల నుంచి తెల్లరాయిని అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ఏ గ్రేడ్ రకం టన్ను రూ.25 వేలు ధర పలుకుతుండటంతో అక్రమార్కులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలకు తీసుకొచ్చి తవ్వకాలు జరిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తెల్లరాయి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశ పెట్టి.. ముంచేశారు!



- పేదల పాలిట శాపంగా ఓటీఎస్ ● నాటి జగన్ సర్కారు నిర్వాకం
- ఎందుకూ పనికి రాకుండా రిజిస్ట్రేషన్ పత్రాలు
- రుణాలు పొందాలంటే రిజిస్ట్రేషన్ శాఖ, బ్యాంకర్ల నిరాసక్తత
- ప్రస్తుత ప్రభుత్వమైనా ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

అల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏ ప్రభుత్వమైనా ఒక పథకాన్ని ప్రవేశపెడిడే దాని ఫలితాలు పేద, మధ్య తరగతి ప్రజల జీవనానికి దోహదపడేలా ఉండాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాల్లో ఒకటి సామాన్యుల పాలిట శాపంగా మారింది. అదే ఓటీఎస్ పథకం. గతంలోని కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలకు పక్కా గృహాలను నిర్మించుకునేందుకు అనుకూలతను బట్టి 18 నుంచి 30 అంకణాల వరకు నివేశన స్థలాలను మంజూరు చేసి గృహాలను సైతం నిర్మించి ఇచ్చాయి. ఇవి విక్రయించేందుకు వీలు లేకుండా వారసత్వంగా అనుభవించుకునేలా ఉత్తర్వులను జారీ చేసి, కాలనీలను నిషేధిత జాబితాలో పొందుపరిచారు.

● ఓటీఎస్ పథకం ఇలా..

గత ప్రభుత్వాల్లో ఇచ్చిన ఆస్తులకు శాశ్వత హక్కును కల్పిస్తామంటూ నాటి వైసీపీ సర్కారు ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్మెంటు) పేరుతో నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియను తీసుకొచ్చింది. ఈ ప్రక్రియ ద్వారా కాలనీల్లో గృహాలను రిజిస్ట్రేషన్ చేస్తామంటూ లబ్ధిదారుల వద్దకే అధికారులను పంపింది. దీనిపై దూరదృష్టి లేని ప్రజలు తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం వస్తుందంటూ ఆశ పడ్డారు.

● రూ.10 వేలకే రిజిస్ట్రేషన్ అంటూ..

ఈవిధంగా వచ్చిన ఆస్తులకు ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుందని నమ్మబలికి పట్టాదారుడే నివాసం ఉంటే సదరు ఆస్తికి ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. యజమాని నుంచి మరొకరికి చేయి మారి ఉంటే రూ.10 వేలు, మూడో వ్యక్తికి మారి ఉంటే రూ.20 వేలు రిజిస్ట్రేషన్ రుసుముతో రిజిస్ట్రేషన్ చేపట్టి వారి పేరుతో పత్రాలను కూడా అందజేశారు. ఇలా దాదాపు పదివేలకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం.

● ఇక్కడే సమస్య

గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతూ బ్యాంకులలో రుణాలను సైతం పొందవచ్చని, అందుకు తాను హామీగా ఉండి రుణాలు అందేలా తాను చర్యలు తీసుకుంటామని నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటన వినగానే ప్రజలు పూర్తిగా నమ్మేశారు. అప్పో సప్పో చేసి నగదు తీసుకొచ్చి వీఆర్వోలకు చెల్లించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పొందారు.

● బ్యాంకర్లు కుదరదన్నా..

అయితే, నాటి ప్రభుత్వ నిర్ణయంపై బ్యాంకర్లు స్పందిస్తూ తమ నిబంధనల ప్రకారం ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ పొందిన పత్రాలపై రుణాలు పొందే అవకాశం లేదని, రుణాలు ఇచ్చేది లేదని కరాఖండీగా చెప్పారు. అయినా లెక్కచేయని జగన్ ప్రభుత్వం ఈ విషయంలో వెనుకడుగు వేయలేదు. దీంతో పేదల నుంచి ముక్కుపిండి వసూలు చేసి వద్దన్నా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ పథకాన్ని జగన్ సర్కారు ప్రవేశపెట్టింది ప్రజల శ్రేయస్సు కోసం కాదని, రూ.4 వేల కోట్ల సేకరణ లక్ష్యాన్ని సాధించేందుకని అప్పట్లో ముమ్మరంగా ప్రచారం నడిచింది. ఇదే ఇప్పుడు నిజమైంది.

● నిండా మునిగిన లబ్ధిదారులు

ఓటీఎస్ పథకం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులు నిండా మునిగిపోయారు. ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు అటు రుణాలు పొందాలంటే ప్రభుత్వ అనుబంధ బ్యాంకులు అప్పుడే తమ నిర్ణయాన్ని వెల్లబుచ్చాయి. ఇటీవల విచ్చలవిడిగా పుట్టుకొచ్చిన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు తాము గృహ

- మిగతా 7లో..

వద్దన్నా.. ఓటీఎస్ రిజిస్ట్రేషన్ చేశారు!



వైసీపీ ప్రభుత్వంలో చేసిన పొరపాటు వల్ల నా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని రిజిస్ట్రేషన్ శాఖాధికారులు అంటున్నారు. రుణం పొంది ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడదామని ప్రయత్నిస్తే ఎవరూ సహకరించడం లేదు. ఇల్లు ఉండి కూడా ఆర్థిక ఇబ్బందులకు ఉపయోగపడని పరిస్థితి.

- విడవలూరు శోభన్, కొత్త సింగపేట, అల్లూరు మండలం

ఉపయోగపడని ఓటీఎస్ ఎందుకు?



ప్రభుత్వం ఏదైనా ప్రక్రియ చేపడితే అది ప్రజల సంక్షేమం కోసమై ఉండాలి. ఉపయోగపడని ఓటీఎస్ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు చేపట్టాలి. మేమే మన్నా అడిగామా!?. అవసరం లేకున్నా ఓటీఎస్ చేసి నేడు నా ఆర్థిక సమస్యల్లో నుంచి బయటపడే వీలు లేకుండా చేశారు.

- గోడ లాజర్, సింగపేట, అల్లూరు మండలం

చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు



'వీపీఆర్ నేత్ర' ప్రారంభోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

- వివరాలు 8లో..

ఔషధ నియంత్రణ శాఖ అధికారిగా హరిహర తేజ

నెల్లూరు (వైద్యం) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారిగా డి. హరిహర తేజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నేతలు కలిసి, సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేర్నాటి ప్రదీప్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్ర, అశోక్, భాస్కర్, లీలా మోహన్, పవన్, పాండు, శీను తదితరులు పాల్గొన్నారు.

8 లో..

ధర్తీ ఆబా పథకం కింద 21 గ్రామాల అభివృద్ధి

వేదగిరి క్షేత్రంలో ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాధనానికి తుప్పు పట్టిస్తారా!?

- 'చెత్త' పనులపై జిల్లా న్యాయాధికారి సీరియస్ ● ఈ-ఆటోలు, ట్రాక్టర్లు మూలనపడడంపై ఆగ్రహం
- సుమోటోగా లోక్ అదాలత్‌లో కేసు నమోదు ● ఎస్సీ కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులకు నోటీసులు ● చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు సూచన

నెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అందాల్సిన స్వయం ఉపాధి వాహనాలు.. ఓ చోట నిరుపయోగంగా పడి ఉండడాన్ని నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజాధనానికి తుప్పు పట్టేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎవరిదీ చెత్త పాపం..?' శీర్షికన జూన్ 18వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఓ కథనం ప్రచురితమైంది. సుమారు రూ.4 కోట్ల విలువ చేసే ఈ యంత్రాలను అధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వదిలేశారు. ఈ వ్యవహారం నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజా ధనాన్ని నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. ఈ మేరకు సుమోటోగా కేసు నమోదు చేయాలని లోక్ అదాలత్ జడ్జిని ఆదేశించారు. ఆ వెంటనే కేసు నమోదు కావడం, తదుపరి అధికారులకు నోటీసులు జారీ కావడం జరిగిపోయాయి. గత నెలలో మున్సిపల్, ఎస్సీ కార్పొరేషన్, పంచాయతీ రాజ్ అధికారులు లోక్‌అదాలత్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. మూలనపడి ఉన్న వాహనాలకు సంబంధించి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. ఇన్నాళ్లపాటు ఆ వాహనాలను ఎందుకు నిరుపయోగంగా వదిలేశారన్నదానిపై కూడా కోర్టుకు వివరణ ఇచ్చుకున్నారు.

● గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2018-19 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 165 ఈ-ఆటోలు మంజూరు చేశారు. ఈ ఆటోల ద్వారా పంచాయతీల్లో చెత్తను సేకరించాల్సి ఉంది. 2019 ఎన్నికలకు ముందే 112 మంది లబ్ధిదారులకు సంబంధించిన ఈ-ఆటోలను పంచాయతీలకు అప్పగించారు. మరో 53 వాహనాలను సంబంధిత ఏజెన్సీ ఆలస్యంగా డెలివరీ చేసింది. అలానే మెకనైజ్డ్ డ్రై క్లీనింగ్ యంత్రాల యూనిట్లు 46 మంజూరయ్యాయి. ఇందులో 23 యంత్రాలను లబ్ధిదారులకు అందించారు. మిగిలినవి ఆలస్యంగా డెలివరీ కావడంతో బుజబుజనెల్లూరులోని ఓ ఖాళీ స్థలంలో దించి ఉంచారు. 2019లో ప్రభుత్వం మారడంతో ఈ వాహనాలను ఎవరూ పట్టించుకోలేదు. లబ్ధిదారులకు అందించేందుకు అనుమతులు ఇవ్వాలంటూ పలుమార్లు జిల్లా నుంచి రాష్ట్ర అధికారులకు లేఖలు వెళ్లినా అక్కడి నుంచి స్పందన లేదు. జిల్లాలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు కూడా మారిపోవడంతో వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు 53 ఈ-ఆటోలు, 23 మెకనైజ్డ్ డ్రైక్లీనింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. ఈ వాహనాల దుస్థితిని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చే వరకూ ప్రస్తుత అధికారులెవరికీ తెలియకపోవడం గమనార్హం.



బుజబుజనెల్లూరులో ఉన్న ఆటోలు (ఫైల్)



● బ్యాటరీలు చోరీ

తాజాగా జిల్లా జడ్జి జోక్యంతో రంగంలోకి దిగిన అధికారులు బుజబుజ నెల్లూరులోని వాహనాలను సాంకేతికంగా పరీక్షించారు. అందులో చాలా వాటిల్లో బ్యాటరీలో చోరీకి గురైనట్లు గుర్తించారు. దాదాపుగా ఈ-ఆటోలు ఇక పనికిరావన్న నిర్ధారణకు వచ్చారు. అయితే మెకనైజ్డ్ డ్రైక్లీనింగ్ యంత్రాలను మాత్రం బాగు చేయించి ఉపయోగంలోకి తీసుకురావచ్చని తేల్చారు. అయితే ఇందుకు నిధులు ఎక్కడి తీసుకురావాలన్నది సమస్యగా మారింది. దీంతో ఈ విషయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నివేదించారు. ఆయన ఉన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. కాగా ఈ వ్యవహారంలో ఓ లబ్ధిదారుడు ఇటీవల జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేసినట్లు తెలిసింది. మెకనైజ్డ్ డ్రైక్లీనింగ్ యంత్రానికి తనను అర్హుడిగా గుర్తించి కొంత డబ్బులు కూడా కట్టించుకున్నారని, కానీ తనకు యంత్రాన్ని ఇవ్వలేదంటూ సదరు వ్యక్తి ఫోరాన్ని ఆశ్రయించడంతో ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి గానూ రూ.5 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్సీ కార్పొరేషన్ వర్గాల ద్వారా తెలిసింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైభవంగా కోదండరామస్వామి ఉత్సవాలు

కలిగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తూరు ప్రాంతంలోని శ్రీకోదండరామ స్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం ఆలయ ప్రాంగణంలో పూర్ణాహుతి , సుదర్శన హోమం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దంపతులకు ఎండుకొబ్బరి, ఆవునెయ్యి, ధాన్యం, రవికలు భక్తితో సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. విశేష పుష్పాలంకరణతో స్వామికి గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామికి కాయ, కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సచివాలయం పక్కనే మురుగు నీరు!



కామాటివారివీధిలో రోడ్లుపైకి చేరిన మురుగునీరు

కావలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జండా చెట్టు సెంటర్‌లోని కామాటి వారివీధిలో ఉన్న 27వ నంబరు సచివాలయం పక్కనే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇక్కడికి కేవలం 20 అడుగుల దూరంలో సచివాలయం ఉన్నా కనీసం మురుగు నీటి సమస్యను పట్టించుకునే నాథుడు కనిపించడంలేదు. కాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సచివాలయ కార్యదర్శులు కూడా డ్రైనేజీని శుభ్రం చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా తొలగించాలని వారు కోరారు.

పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల తనిఖీ



పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రాఘవేంద్రరావు

కావలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం కావలి ప్రాంతంలోని పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్లను సోమవారం జిల్లా ఎస్‌ఈ రాఘవేంద్రరావు స్థానిక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. వాహనాలకు అవసరమయ్యే చార్జింగ్ సమయం, వినియోగమయ్యే యూనిట్ల పరిమాణం. విద్యుత్ భద్రతా ప్రమాణాలు, సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్‌ఈ రాఘవేంద్రరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు, సుస్థిర అభివృద్ధి నేపథ్యంలో విద్యుత్ వాహనాలదే భవిష్యత్ అని తెలిపారు. ప్రభుత్వ విజన్ 2047 లో భాగంగా ఈవీ వాహనాల వినియోగం వైపు అడుగులు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవీ చార్జింగ్ స్టేషన్ల నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, కావలి ఈఈ బెనర్జీ, డీఈఈ రవికుమార్ ఏఈలు శ్రీనివాసులు రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలురు

కావలి (టౌన్) నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను గుర్తించేందుకే ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహమందిస్తోందని డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 19 బాల బాలికలకు డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించారు. డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి డివిజన్ జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో 1 గోవిందయ్య, ఎంఈవో 2 వెంకటసుబ్బయ్య, జెడ్పీ హెచ్‌ఎమ్ మాధవ, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ విభజనపై సమావేశం



పెంట్రాల పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల గ్రామ పంచాయతీ విభజనపై పంచాయతీ కార్యవర్గ సమావేశం సోమవారం పెంట్రాల పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ కె శ్రీనివాసులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు నిర్వహించారు. ఈ పంచాయతీలో పెంట్రాల, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాలు విలీనమై ఉన్నాయి. అయితే ఈ మూడు గ్రామాలు మూడు పంచాయతీలుగా విభజన చేసేందుకు పంచాయతీ వార్డు సభ్యుల అభిప్రాయాలు సేకరించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచు, మొత్తం 10 మంది వార్డు సభ్యులు హాజరయ్యారని డిప్యూటి ఎంపీడీఓ శ్రీనివాసులు తెలియజేశారు. పంచాయతీని విభజించాలా, లేక ఉమ్మడిగా ఎప్పటిలాగే ఉండాలా అనే అంశంపై వార్డు సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. తగిన చర్యల కోసం వార్డు సభ్యుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీకి కరేడు విద్యార్థులు



క్రీడా ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసులు, పీడీ శ్రీనివాసులు

ఉలవపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ సెలక్షన్స్‌లో కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కబడ్డి జట్టుకు ఎంపికైన ఆర్ యశ్వంత్, బీ వర్షిత, కే చరిష్మా, కే శాంతిప్రియలు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్నూల్‌లో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ పీ శ్రీనివాసులు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎంతో పాటు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ బాలేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి మణివిష్ణువర్ధన్ ఎంపిక



వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మర్రి మణివిష్ణువర్ధన్ ఎంపికైనట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కత్తి ఐజక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మణివిష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు మణివిష్ణువర్ధన్‌కు అభినందనలు తెలిపారు.

ఆశ పెట్టి.. ముంచేశారు!

(5వ పేజీ తరువాయి)

రుణాలను అందిస్తామంటూ తమ నిబంధనలు అనుసరించి సాధారణ రిజిస్ట్రేషన్ పొందిన లబ్ధిదారులకు మాత్రమే రుణాలను అందిస్తున్నారు. ఓటీఎస్ పత్రాలను దరిదాపులకు కూడా రానివ్వడం లేదు.

● **ససేమిరా అంటున్న రిజిస్ట్రేషన్ శాఖ**

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు తమ ఇళ్లపై రుణాలను పొందాలనే ఉద్దేశంతో ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలను పక్కనపెట్టి సాధారణ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తున్నారు. సంబంధిత అధికారులు లబ్ధిదారుల పేర్లపై ఆన్‌లైన్‌లో పరిశీలించి వారు చేయించుకోవాలనుకున్న ఆస్తి ఇదివరకే ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ అయిపోయిందని, నిబంధనల ప్రకారం మరోసారి రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని, ఓటీఎస్ ద్వారానే రుణలు పొందాలని తేల్చిచెబుతున్నారు. ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలపై రుణాలు ఇవ్వమంటే ఫైనాన్స్ కంపెనీలు ససేమీరా అంటున్నాయి. దీంతో ఇటు చెంపదెబ్బ, అటు గోడదెబ్బ అన్న చందంగా పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి మారింది.

అన్న క్యాంటీన్‌లో నాసిరకం భోజనం

కావలి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కావలి అన్న క్యాంటీన్‌లో నాసిరకం భోజనం పెడుతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో ఎం వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. ఒక్కో భోజనానికి ప్రభుత్వం రూ.35 ప్రకారం చెల్లిస్తున్నా, కాంట్రాక్టర్ మాత్రం నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. బియ్యం కూడా నాణ్యమైనవి వాడటం లేదన్నారు. అధికారులు స్పందించి అన్నక్యాంటీన్ ద్వారా నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జరుగుమల్లి విజయరత్నం, టీ. మణి, జెడ్డా వాసు, లక్ష్మీనర్సు, నక్కా జక్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

జక్కా వెంకయ్యకు నివాళి



జక్కా వెంకయ్య చిత్రపటం వద్ద లాల్ సలామ్ చేస్తున్న కామ్రేడ్లు

కావలి (టౌన్) నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి పెంచలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకయ్య పేదలకు అందించిన సేవలు అనిర్వచనీయమన్నారు. సాగునీటి కోసం ఆయన చేసిన కృషిని జిల్లా రైతాంగం మరవదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ వెంకయ్య, తిరుపాలు, బి కృష్ణయ్య, వై కృష్ణమోహన్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

బిట్రగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ వీర రఘు ఆధ్వర్యంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరై కోటి సంతకాల సేకరణ ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, జెడ్పీటీసీ కీర్తన, మాజీ ఎంపీపీ సులోచన, ఎంపీటీసీలు ఎం పద్మ, సుందర్‌రాజ్, నేతలు అంకులయ్య, శ్రీనివాసులు, కళ్యాణ్, సురేష్, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా.. ఇంతేనా ?



ధ్వంసమైన రోడ్డుపై వాహనచోదకుల పాట్లు

అల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు నుండి కావలికి వెళ్లే మార్గం అధ్వాన్నంగా తయారైంది. గత టీడీపీ హయాంలో మంజూరైన ఈ రోడ్డు నిర్మాణం వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టారు. అయితే కనీసం మూడేళ్లు కూడా గడవక ముందే రోడ్డు ధ్వంసమైంది. నిర్మించిన ఆరు నెలలకే అల్లూరు పొలిమేరలోని పెట్రోల్ బంకు వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. ఎన్నికల సందర్భంలో కొంతమంది నాయకులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అయినా మూడడుగుల లోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో తరచూ వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు ఉదయగిరి అభివృద్ధి ఫోరం ప్రతినిధులు ఎండీ ఖాజా, శ్రీరామచంద్రమూర్తిలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలు, డివిజన్ల పునర్విభజణపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించి సమీక్షిస్తోందన్నారు. అనాదిగా అభివృద్ధి నోచుకోని, విస్తీర్ణంలో పెద్దదైన ఉదయగిరి నియోజకవర్గాన్ని ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని వారు కోరారు.

అధ్వానంగా వలేటివారిపాలెం - అగ్రహారం రోడ్డు



వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం - అగ్రహారం రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేసినా రోడ్డు పనులు జరగలేదు. నిధులు మంజూరై ఏడాది దాటినా ఇంతవరకూ రోడ్డు పనులు ప్రారంభించలేదు. కాగా, వలేటివారిపాలెం నుండి రామచంద్రాపురం వరకూ రహదారి అధ్వానంగా మారింది. రోడ్డంతా మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభించాలని వాహనదారులు కోరుతున్నారు.

'ప్రకాశం'లో పీసీబీ డిజైన్ ఫాబ్రికేషన్ వర్క్‌షాప్



మాట్లాడుతున్న కాలేజీ కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్

కందుకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వారంరోజుల పీసీబీ డిజైన్ అండ్ ఫాబ్రికేషన్ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ ఇన్‌స్ట్రక్టర్ రుబీనా, కళాశాల వర్క్‌షాప్ కోఆర్డినేటర్ మస్తాన్‌వలి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో సర్క్యూట్‌బోర్డుల రూపకల్పన, తయారీ పద్ధతులు సర్క్యూట్ అనాలసిస్ వంటి అంశాలను నేర్పించటం జరిగిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్‌బ్రాంచ్ విద్యార్థినీ, విద్యార్థులకు భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటికి విద్యార్థులను సన్నద్ధం చేయటమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, ఈసీఈ హెడ్ గద్దె రమేష్, ఈఈఈ హెడ్ మీరా షరీఫ్, మస్తాన్‌వలి, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి



సబ్ కలెక్టర్ హిమవంశీకి వినతిపత్రం అందచేసిన మత్స్యకారులు

ఉలవపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని రామాయపట్నం గ్రామానికి చెందిన మజరా పల్లెపాలెం మత్స్యకారులు సోమవారం సాయంత్రం ఉలవపాడు రెవెన్యూ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ దామెర హిమవంశీని కలిసి వినతి పత్రం అందచేశారు. సముద్ర తీరం వెంబడి జల్లీఫిష్‌ల కోసం కట్టిన 6 తొట్లిలు తుఫాన్ తాకిడికి, సముద్రం అలలకు ధ్వంసమయ్యాయని, అదేవిధంగా రెండు రొయ్యల చెరువుల్లోని పంట పూర్తిగా కొట్టుకుపోయిందని సబ్ కలెక్టర్‌కి వివరించారు. సచివాలయం ఫిషరీష్ అసిస్టెంట్ అధికారుల ఆదేశాల మేరకు జరిగిన నష్టంపై నివేదిక తయారు చేశారని, దానిపై స్పందించి నష్టపరిహారం వచ్చేలా చూడాలని మత్స్యకారులు సబ్‌కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



రవితేజ కుటుంబసభ్యులకు ఆర్థికసహాయం అందజేస్తున్న పువ్వాడి మౌనిక

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న తోకల రవితేజకు స్కంధపురి సేవాసమితి తరఫున రూ. 50వేలు ఆర్థిక సహాయం అం దించారు. సేవాసమితి ఛైర్మన్ పువ్వాడి మౌనిక దాతల నుంచి సేకరించిన రూ. 40వేలకు తాను రూ. 10వేలు కలిపి హాస్పటల్‌కు వెళ్లి రవితేజను పరామర్శించి మొత్తాన్ని అందజేశారు.

కందుకూరును 'ప్రకాశం'లో కలపాలని వినతి



సబ్ కలెక్టరు హిమవంశీకి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని కోరుతూ వైసీపీ నేతలు సోమవారం సబ్ కలెక్టరు దామెర హిమవంశీకి వినతిపత్రం అందజేశారు. రామాయపట్నం పోర్టుకోసం కందుకూరును నెల్లూరులోనే ఉంచేలా కొందరు పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నందున ఇక్కడి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేసి గతంలో మాదిరిగానే కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపేలా చూడాలని కోరారు. గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్‌లు ఇచ్చిన హామీమేరకు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు. సబ్ కలెక్టరును కలిసిన వారిలో వైసీపీ నేతలు తోకల కొండయ్య, గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, షేక్ రఫీ, ఈదర రమేష్, ఆర్. బ్రహ్మానందం, చీమల రాజా, వల్లూరి కోటేశ్వరరావు, తదితరులున్నారు.

గెస్ట్ జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండు లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నందున ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె వాణీశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో ఉర్దూ, ఆంగ్లం బోధించేందుకు జూనియర్ లెక్చరర్స్‌ను నియమించాల్సి ఉందన్నారు. అందుకు గాను ఉర్దూ బోధించుటకు ఎంఏ (ఉర్దూ), ఆంగ్లం బోధించుటకు ఎంఏ (ఇంగ్లీషు) పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల7వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్స్‌తో ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.

భైరవకోనకు ప్రత్యేక బస్సు

ఉదయగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భైరవకోన క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ రమేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు ఉదయగిరిలో బయలుదేరి సీతారామపురం మీదుగా భైరవకోన క్షేత్రానికి చేరుకొంటుందన్నారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలి



రైతులకు ఉచితంగా మందులు అందిస్తున్న డీడీ నాగమణి, పశువైద్య సిబ్బంది

కలువాయి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు పశువులకు తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి రైతులకు సూచించారు. మండలంలోని కుమ్మరిపల్లెలో సోమవారం రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పశువులకు గాలికుంటు, గొంతువాపు టీకాలతోపాటు పశువుల నుంచి మనుషులకు వచ్చే బ్రూసెల్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసులు, ఏడీ గురు జయంతి, పశువైద్యులు కృష్ణమోహన్, కృష్ణప్రసాద్, రాజేష్, జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం



కందుకూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కందుకూరు గ్రామదేవత అంకమ్మకు అభిషేకం, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న మహా శివలింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కార్తీక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవనిలో ఇద్దరు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం నారాయణ, సిబ్బందితో సోమవారం సాయంత్రం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో వారి నుంచి రూ.19,100 నగదు, 4 మోటారు సైకిళ్లు సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డులో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్‌లో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిన అన్ని ప్రాంతాలకు మంగళవారం కూడా సరఫరా నిలిచిపోతుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

చినపవనిలో అధిక ధరకు విత్తనాల విక్రయం

లింగసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవనిలో లైసెన్సు లేని మరో మండలానికి చెందిన ఓ పురుగు మందులు, విత్తనాల దుకాణం డీలరు ఒకరు లారీలో వరి విత్తనాల బస్తాలను తెచ్చి అధిక ధరకు విక్రయించినా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుడ్లూరు మండల కేంద్రంలోని పురుగు మందుల, విత్తనాల డీలరు ఒకరు లారీలో సుమారు 1200 బస్తాల షుగర్‌లెస్, కెఎన్‌ఎం రకం వరి విత్తనాలను చినపవని గ్రామానికి తెచ్చి గ్రామంలోని రైతులకు విక్రయించారు. ఆయన షుగర్‌లెస్ రకం 25 కేజీల విత్తనాల బస్తాను ఒక్కో రూ.1070కు, కెఎన్‌ఎం రకం 25 కేజీల వరి విత్తనాల బస్తాను ఒక్కోటి రూ1040కు అమ్మినట్టు గ్రామ రైతులు తెలిపారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరకు అమ్మినట్టు వారు చెప్పారు. అలాగే రైతులు కొన్న వరి విత్తనాల బస్తాకు ఆయన ఎలాంటి బిల్లులు ఇవ్వలేదని చెప్పారు.


కథే ఈ సినిమాకు హీరో



దేవన్

దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం




భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

దీక్షిత్ శెట్టి



'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

'డయల్ యువర్ సీఎండీ'లో ఫిర్యాదులు

నెల్లూరు(జడ్పీ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎస్పీడీసీఎల్ పరిధిలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నుంచి పలువురు సమస్యలు తెలియజేసినట్లు సీఎండీ శివశంకర్ తెలిపారు. గృహాలపై విద్యుత్ తీగలు, వ్యవసాయ కనెక్షన్లు, విద్యుత్ లైన్ల మార్పు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు తదితర సమస్యలపై ఫిర్యాదులు డయల్ యువర్ సీఎండీకి ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటిని వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. దీంతో పాటు టోల్‌ఫ్రీ నెంబర్లు 1912 లేదా 1800425, 155333కు వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే 9133331912 వాట్సాప్ నెంబర్‌కు వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చునని ఆయన తెలిపారు.

ట్రావెల్స్ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని బుజబుజ నెల్లూరు వద్ద ఒంగోలు వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు సోమవారం ఉదయం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గూడూరు వైపు నుంచి ఒంగోలు వైపు వేగంగా వెళు తున్న ఎస్‌వీటీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సరిగ్గా బుజబుజనెల్లూరు హైస్కూల్ వద్దకు వచ్చే సరికి టైరు పేలడంతో బస్సు రోడ్డుకు అటూ ఇటూ తిరిగి పక్కన ఆగింది. ఆ సమయంలో బస్సుకు ముందు, వెనుక వాహనాలు రాకపోవడతో పెద్ద ప్రమాదమే తప్పింది. అదే ప్రాంతంలో ఎన్‌హెచ్ఏఐ వాహనం ఉండటంతో బస్సును ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పక్కకు తీసుకెళ్లారు. దీంతో ట్రాఫిక్‌కు పెద్దగా అంతరాయం ఏర్పడలేదు. బస్సు టైరు పేలడంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు బస్సును దిగి ఇతర వాహనాల్లో గమ్య స్థానాలకు వెళ్లారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు,((ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చెరువులో ఆదివారం సాయంత్రం గల్లంతైన యువకుడు నలిశెట్టి మహేష్(30) మృతదేహం సోమవారం ఉదయం చెరువులో తేలి యాడింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు.

పోలీసు పీజీఆర్ఎస్ వేదిక మార్పు

● అర్జీలు ఇచ్చేందుకు బాధితుల అవస్థలు ● క్యూలో నిల్చోలేక ఇక్కట్లు





అర్జీదారు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, క్యూలో నిల్చొని ఉన్న బాధితులు

నెల్లూరు(క్రైం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో గత సోమవారం పోలీసు పీజీఆర్ఎస్ రద్దయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం వందలాది మంది తరలి వచ్చారు. అయితే అలవాటు ప్రకారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్దకు భారీగా బాధితులు చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాటు కన్పించకపోవడంతో గ్రీవెన్స్ ఉందా... లేదా..? అని అక్కడున్న పోలీసు సిబ్బందిని ప్రశ్నించారు. 'ఉంది.. ఉంది.. పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.. అక్కడికి వెళ్లండి'.. అని సమాధానం ఇచ్చారు. వేదిక మార్పు చేయడంతో అప్పటికే చాలామంది వెనుతిరిగారు.

● సరిపోని ఏర్పాట్లు

జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. అయితే పోలీసు కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు బాధితులకు ఏ మాత్రం సరిపోలేదు. కార్యాలయం బయట టెంట్లు ఏర్పాట్లు చేసి, డీఎస్పీలు వినతులు స్వీకరించారు. ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల కార్యాలయానికి వచ్చిన తర్వాత టెంట్ల నుంచి కార్యాలయం లోపల ఫిర్యాదులు స్వీకరించేలా చర్యలు చేపట్టారు. కార్యాలయం లోపల అప్పటికప్పుడు ఏర్పాట్లు చేయడం, బయట ఫిర్యాదులు స్వీకరించడం నిలిపి వేయడంతో బాధితులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది.కాగా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసే బాధితులు క్యూలో నిలబడలేక అవస్థలు పడ్డారు.

వేదగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక బృందం

వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. విష్వక్సేన పూజతో మొదలై విశేష పూజల అనంతరం యాగశాలలో కుంభారాధన, కర్తహోమం, అగ్ని ప్రణయణం అనంతరం సర్వ గాయత్రీ హోమం, మహా పూర్ణాహుతి, యాత్రాదానం, అక్షతారోపణతో సుదీర్ఘంగా చేపట్టిన పవిత్రోత్సవాలు ముగిస్తున్నట్లు అర్చక బృందం ప్రకటించింది. అనంతరం క్షేత్రానికి వచ్చిన భక్తజనానికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏడాదికి ఒక్కసారి వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ వేడుకలు అత్యంత ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి దంపతులు, ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

- నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు కాకర్ల, ప్రశాంతిరెడ్డి తదితరులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా సీఎం చంద్రబాబు నియోజకవర్గాలకు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని, ఆయన స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీపీఆర్ ఫౌండేషన్ అధినేత, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రామాపురంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని ఉదయగిరి, కోవూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ తాను చేపట్టే కార్యక్రమాలను ఉదయగిరి నుంచి ప్రారంభిస్తే విజయవంతం అవుతాయనే ధృడ నమ్మకం ఉందన్నారు. ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకొని ఉచితంగా కంటి అద్దాలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తుల్లో కాకర్లతో కలిసి ఈ ప్రాంతానికి వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్ నుంచి తాగు, సాగు నీటిని తీసుకొచ్చి ఉదయగిరిని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీఎంఆర్ఎఫ్, ట్రై సైకిళ్లను బాధితులకు అందజేశారు. అనంతరం కంటి వ్యాధితో బాధపడుతున్న బాధితులకు పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, టీడీపీ నేతలు చంచలబాబు యాదవ్, చంద్ర మధుసూదనరావు, మహేష్, నక్కలగండి చైర్మన్ వేమూరి మధు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్, నాదెండ్ల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వారం వారం.. అర్జీదారుల జాతర

● సమస్యలు యథాతథం ● పరిష్కారానికి పడిగాపులు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి సమస్యలు పరిష్కరించాలని పెద్దసంఖ్యలో ప్రజలు వారంవారం కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. భూసమస్యలు, ఇళ్ల స్థలాలు, భూములు కావాలని, రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇప్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తిచెందేలా ప్రతీ అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై దృష్టిపెట్టి మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. ఏ శాఖ పరిధిలోనూ వినతులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. సమస్యను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో ప్రజలకు తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం. వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అందిన అర్జీల్లో కొన్ని...

● తనకు ఇస్తున్న దివ్యాంగ పింఛన్‌ను రూ.6వేల నుంచి రూ.15లకు పెంచాలని ఊటుకూరుకు చెందిన వెంకటరమణమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● బుజబుజనెల్లూరులోని వాటర్‌ప్లాంటును పరిశీలించి న్యాయం చేయాలని సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆలూరు తిరుపాలు, నందిపాటి మాలకొండయ్య, కే. కృష్ణమూర్తి,డీ. వెంకటేశ్వర్లు, టీ. శ్రీనివాసులు, టీ. రవి, సరేంద్ర, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు జీవీ. రమణయ్య వినతిపత్రం సమర్పించారు. పాత పద్ధతిలోనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

● దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌పై విచారణ జరపాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని నగరంలోని 25వ డివిజన్ ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● తమ భూమిలోకి రానివ్వకుండా మనోజ్ అనే వ్యక్తి అడ్డుకుంటున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని దగదర్తి మండలం వెలుపోడుకి చెందిన దొరసానమ్మ, వంకదారి బాదుల్లా వినతిపత్రం సమర్పించారు.

ధర్తీ ఆబా పథకం కింద గ్రామాలాభివృద్ధి : ఐటీడీఏ పీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా పథకం కింద జిల్లాలోని 21 గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని ఐటీడీఏ పీవో టీ. మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో జ నజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్తీ ఆబా పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆమోదం లభించిన వెంటనే మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గిరిజనుల సంక్షే మం కోసం జిల్లాలో ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతున్నామని ఆయన వివరించారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ఉరవకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఉరవకొండ ఎంఈఓ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో అండర్ -19 బాలురు, బాలికల విభాగంలో అనంతపురం, కృష్ణా జిల్లాలు తలపడగా కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో అనంతపురం, కృష్ణా జిల్లాలు తలపడగా కృష్ణా జిల్లా జట్టు విజయం దక్కించుకుంది. అండర్-14 విభాగంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జట్లు తలపడగా.. తూర్పు గోదావరి విజయం సాధించింది. బాలికల విభాగంలో నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల జట్లు తలపడగా.. నెల్లూరు విజయం సాధించింది. గెలుపొందిన క్రీడాకారులకు ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, సత్యనారాయణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతి ప్రసాద్, పీఈటీలు రాఘవేంద్ర, నాగరాజు, నాగేంద్ర, హలీమా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

PARAS